మహిళలపై హింసను అరికట్టేందుకు

ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 331 | విజయవాడ, ఆదివారం 2 జులై 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 2 July 2023 | Rs



ముంచాలని చూస్తే దించేస్తారు : వివిఎస్ఆర్

లోపలి పేజీలో..



మంత్రి అంబటి రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న గఫూర్, లక్ష్మణరావు, వైవి, నాగమణి, కిరణ్ తదితరులు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై

5న ఉన్నతస్థాయి సమావేశం

- సిపిఎం నేతలకు మంత్రి అంబటి హామీ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర బృందం గుంటూరులో శనివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు విజ్ఞప్తి చేసింది. నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపించడం లేదని పేర్కొంది. నిర్వాసితుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, పునరావాస కాలనీల్లో మంచినీరు, వీధిదీపాలు లేవని, స్మశానాలు సైతం ఏర్పాటు చేయలేదని మంత్రి దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, నిర్వాసితుల సమస్యలపై ఈ నెల ఐదున విజయవాడలో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తానని నాయకులకు హామీ ఇచ్చారు. మంత్రిని కలసిన వారిలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఉన్నారు. నిర్వాసితుల సమస్యలను మంత్రికి వివరించారు. పునరావాసం, పరిహారం పూర్తిగా అమలు చేసే వరకూ గ్రామాలను ఖాళీ చేయించరాదని కోరారు. 'పునరావాసం పూర్తయ్యే వరకు ముంపు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించాలి. 1986, 2022లలో వచ్చిన వరద ముంపు ఆధారంగా ముంపు గ్రామాలను రీ సర్వే చేయాలి. పునరావాసం దశల వారీగా కాకుండా ఏకకాలంలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలి. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్ అండ్ ఆర్ పరిహారం అర్హులందరికీ ఇవ్వాలి. ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న ప్రతి ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించాలి. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసిత కుటుంబానికీ కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా రూ.10.50 లక్షల పరిహారం ఇవ్వాలి. గ్రామాలను ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన యువతీయువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. పెళ్లయిన ఆడపిల్లలకు కూడా ప్యాకేజీ వర్తింపజేయాలి. సర్వం కోల్పోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వోద్యోగం ఇవ్వాలి. ముంపు ప్రాంతాల ఉద్యోగులందరినీ యథావిధిగా తరలించే ప్రాంతాల్లో కొనసాగించాలి. నిర్వాసితుల కాలనీల్లో ఉపాధి పనులు ప్రారంభించాలి. ముంపు మండలాల్లో మునిగిపోతున్న పాఠశాలలు, కళాశాలలను పునరావాస కాలనీల్లో నిర్మించేందుకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలి. పునరావాస కాలనీల్లో అన్ని రకాల ప్రాథమిక సౌకర్యాలూ కల్పించాలి. నిర్వాసితులు స్థిరపడేంత వరకు కాలనీలన్నింటికీ ఒక ఐఎఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. నిర్వాసితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతి డివిజన్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాలి' అని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

బతుకులు బుగ్గి

బస్సు ప్రమాదంలో 25 మంది సజీవ దహనం

- మహారాష్ట్రలో ఘోరం
- రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల సంతాపం



మహారాష్ట్రలో ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైన బస్సు, (ఇన్‌సెట్‌లో) మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ముంబయి : మహారాష్ట్రలోని బుల్డానా జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రైవేటు బస్సుకు నిప్పంటుకోవడంతో 25మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారిలో ముగ్గురు చిన్నారులు కూడా వున్నారు. మరో ఎనిమిది మంది గాయాలతో బయటపడ్డారు. బుల్డానా జిల్లాలోని పింపాల్‌కుటా గ్రామం వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.26గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. టైర్ పేలిపోవడంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని, డివైడర్‌ని ఢీ కొనడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని బుల్డానా ఎస్‌పి సునీల్ కదాస్నే తెలిపారు. ఆ సమయంలో బస్సులో 33మంది ప్రయాణికులు వున్నారు. విదర్భ ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సు నాగ్‌పూర్ నుండి పూనేకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగిపోయింది. గాయపడిన వారి పరిస్థితి నిలకడగా వున్నట్లు తెలుస్తోంది. బస్సులో మంటలు వ్యాపించగానే కిటికీ అద్దాలు పగలగొట్టి ఏడుగురు బయటకు దూకేశారని పోలీసులు తెలిపారు. మంటల్లో పూర్తిగా దగ్ధమై పోయిన వారిని గుర్తించడం ఇప్పుడు పెద్ద సవాలుగా మారిందని పోలీసు అధికారులు వ్యాఖ్యానించారు. బస్సు ఎడమ వైపునకు బోల్తా పడిందని, తలుపు పూర్తిగా కాలిపోవడంతో తప్పించుకునే మార్గం లేకుండా పోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 'మంటల్లో చిక్కుకుని వారు ఆర్తనాదాలు చేస్తూ, కాలి బూడిదైపోవడం అంతా మా కళ్ళముందే జరిగినా ఏం చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయామని' ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. డీజిల్ ట్యాంక్ లేదా ట్యాంక్‌కు డీజిల్ సప్లయి చేసే పైపు గానీ పేలిపోయి వుండవచ్చని బాధితులను ఆదుకోడానికి వచ్చిన న్యాయవాది సందీప్ చెప్పారు. అంతా కన్నుమూసి తెరిచేలోగానే జరిగిపోయింది. ఏం జరుగుతోందో అర్థం చేసుకునేలోపు జరగాల్సిన అనర్థం జరిగిపోయిందని ఈ ప్రమాదం నుండి బయటపడిన వారు చెప్పారు. చేతులతో గట్టిగా బాది అద్దాలు పగలగొట్టి బయటకు దూకేశామని వారు చెప్పారు.

రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల సంతాపం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు నేతలు ఈ ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారికి సంతాపం తెలియచేస్తూ వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ వార్త వినగానే తన హృదయం కలిచివేసిందని రాష్ట్రపతి ట్వీట్ చేశారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి పిల్లలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు ఎక్స్‌గ్రేషియాను ప్రధాని ప్రకటించారు.

మహారాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా

జరిగిన దుర్ఘటన పట్ల ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తీవ్ర విచారం వెలిబుచ్చారు. మరణించినవారి కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, తక్షణమే విచారణ జరపాల్సిందిగా వారిని ఆదేశించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ కూడా బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియచేశారు.

డిఎన్ఎ పరీక్షలతో గుర్తింపు

గుర్తు పట్టడానికి వీల్లేకుండా కాలిపోయినందున డిఎన్ఎ పరీక్షలు నిర్వహించి తద్వారా గుర్తించాలని అధికారులు నిర్ణయించారు. డిఎన్ఎ గుర్తింపు ముగిసిన వెంటనే మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందచేస్తామని బుల్డానా జిల్లా కలెక్టర్ డాక్టర్ హెచ్.పి.తుముడ్ తెలిపారు.

టైర్ బరస్ట్, అతి వేగం కారణం కాకపోవచ్చు : ఆర్‌టిఓ నివేదిక

బస్సు ప్రమాదానికి కారణం టైరు పేలిపోవడం కాకపోవచ్చని అమరావతి ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్‌టిఓ) ఒక నివేదికలో పేర్కొంది. టైరు పేలిపోయిందనడానికి మిగతా 5లో



నడిరోడ్డుపై నెత్తుటి ధార

- కెన్యాలో బీతావహం సృష్టించిన ట్రక్కు
- వాహనాలు, పాదచారులపై దూసుకెళ్లి విధ్వంసం
- 51 మంది మృతి - 32 మందికి గాయాలు

లోపలి పేజీలో..



నీరజ్‌కు స్వర్ణం

- లాసన్నె డైమండ్ లీగ్

ఫ్రాన్స్‌లో ఆరని మంటలు

- 1300మందికి పైగా అరెస్టులు
- వేల సంఖ్యలో దహనాలు



పారిస్‌లోని రిపబ్లిక్ కూడలి వద్ద వేలాదిగా తరలివచ్చి ఆందోళన చేస్తోన్న ప్రజలు

పారిస్ : మూడు రోజులైనా నిరసన మంటలు చల్లారకపోవడంతో తాజా పరిస్థితిపై చర్చించేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. బ్రసెల్స్‌లో జరిగిన యూరోపియన్ యూనియన్ శిఖరాగ్ర సమావేశం నుంచి అర్ధంతరంగా తిరిగి వచ్చి,న మాక్రాన్ నిరసనకారులపై నిర్బంధాన్ని తీవ్రతరం చేశారు. శుక్రవారం రాత్రి ఒక్క రోజే 1300 మందిని అరెస్టు చేశారు. అయినా, నిరసనలు ఆగలేదు. శుక్రవారం ఒక్క రోజే 3,880 చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పాఠశాలలు, లైబ్రరీలకు నిప్పు పెట్టారు. అల్లర్లను అదుపు చేసేందుకు బాణా సంచాలతో సహా పేలుడు పదార్థాలు, ఇంధన అమ్మకాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. వీధుల్లోంచి వెళ్లాలని నిరసనకారులను కోరింది. టీనేజర్లను ఇంటి నుంచి బయటకు పంపొద్దని వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది. దేశవ్యాపితంగా బస్సులు, ట్రామ్ సర్వీసులను నిలిపివేసింది. ప్రదర్శనలపై నిషేధం విధించింది. భద్రత పకడ్బందీగా ఉండే వాహనాలను ఉపయోగించాలని సూచించింది. మరోవైపు పోలీసు కాల్పుల్లో మరణించిన 17ఏళ్ళ నహేల్ అంత్యక్రియలకు వారి కుటుంబం సన్నాహాలు చేస్తోంది. హింసాత్మక చర్యలను అణచివేసేందుకు శుక్రవారం రాత్రి 45వేలమందికి పైగా పోలీసు అధికారులను మోహరించారు. ఇంతలా బందోబస్తు ఏర్పాట్లు చేసినా 31 పోలీసు స్టేషన్లపై దాడి జరిగిందని అధికారులు శనివారం తెలిపారు.

జాత్యహంకారానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలి : ఫ్రాన్స్ ప్రభుత్వానికి ఐరాస విజ్ఞప్తి

17 ఏళ్ల ఆఫ్రికన్ నల్ల జాతి యువకుడైన నేల్‌ను పోలీసులు కాల్చి చంపడం ఫ్రాన్స్‌లో పాతుకుపోయిన జాత్యహంకారానికి ఒక నిదర్శనమని ఐక్యరాజ్యసమితి వ్యాఖ్యానించింది. యువకుని హత్యపై ప్రభుత్వం సరిగా స్పందించాలని ఐరాస కోరింది. జాత్యహంకారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని, దేశంలో వీలైనంత త్వరగా శాంతి భద్రతలు పునరుద్ధరించాలని ఐరాస మానవ హక్కుల సంఘం నేత రవీనా శ్యాందాసాని కోరారు. ఫ్రెంచ్ పోలీసులు అమానుషంగా పొట్టనబెట్టుకున్న నేల్ అనే యువకుడి అమ్మమ్మ అల్జీరియన్ మూలాలున్న వ్యక్తి అని శ్యాందాసాని తెలిపారు.

20 నుంచి వర్షాకాల పార్లమెంటు

- 23 రోజులు, 17 సిట్టింగ్‌లు
- పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి వచ్చే నెల 11 వరకు జరగనున్నాయి. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి శనివారం ట్విట్టర్ ద్వారా ఈ సంగతి వెల్లడించారు. 23 రోజులు, 17 సిట్టింగ్‌లు ఉంటాయని ఆయన తెలిపారు. పాత పార్లమెంట్ భవనంలో ప్రారంభమవుతాయి. తరువాత కొత్త భవనానికి మార్చనున్నారు. నూతన పార్లమెంటు భవనాన్ని మే 28న ప్రధాని మోడీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. వివాదాస్పద ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) బిల్లు, అలాగే ఢిల్లీ ఆర్డినెన్స్ స్థానే బిల్లును ప్రభుత్వం ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశముంది. కేంద్ర పౌర స్మృతిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ జూలై 3న సమావేశం కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ సోనియా నివాసంలో శనివారం సమావేశం అయింది. యుసిసిపై చర్చలో ఎలాంటి వైఖరి తీసుకోవాలనే దానిపై ఇంతవరకు ఊగిసలాట ధోరణినే ప్రదర్శించింది. ప్రధాన సమస్యలైన మిగతా 5లో

వికలాంగుణ్ణి కొట్టి చంపిన

గో గూండాలు

పాట్నా : గొడ్డు మాంసాన్ని రవాణా చేస్తున్నారనే నెపంతో వికలాంగుడైన ముస్లిం ట్రక్కు డ్రైవర్ మహ్మద్ జహిరుద్దీన్ (55) ను గోగూండాలు కొట్టి చంపేశారు. బీహార్‌లోని సరాన్ జిల్లాలోని జలాల్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఖోరి పాకర్ ఏరియాలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వైద్య ప్రయోజనాల కోసం జంతువుల ఎముకలను రవాణా చేస్తుండగా ట్రక్కు డ్రైవర్‌ను పరివార్ మూకలు కొట్టి చంపేశాయి. తేజ్‌పూర్ బసహి నుండి గౌరాలోని ఎముకల ఫ్యాక్టరీకి ట్రక్కు వెళుతోంది. మార్గమధ్యంలో రోడ్డుపై ట్రక్కు ఆగిపోవడంతో డ్రైవర్ మరమ్మత్తులు చేస్తుండగా ఈ దాడి జరిగింది. ట్రక్కులో వున్న హెల్పర్ ఖుర్షీద్‌అలీ అక్కడ నుండి పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు. కాగా డ్రైవర్ జహిరుద్దీన్‌కు ఒక కాలులో స్టీల్ రాడ్ వేయడంతో ఆయన పరిగెత్తలేకపోయాడు. దాంతో మూకలు డ్రైవర్‌ను పట్టుకుని చితకబాది, అక్కడ నుండి పారిపోయారు. వెంటనే డ్రైవర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయింది. అప్పటికే చనిపోయాడు.

ఎన్‌పిఆర్‌డి ఖండన



గోగూండాలు జహిరుద్దీన్‌ను కొట్టి చంపడాన్ని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక (ఎన్‌పిఆర్‌డి) తీవ్రంగా ఖండించింది. ఫ్యాక్టరీకి జంతువుల ఎముకలు తీసుకెళ్ళడం కూడా నేరమైపోయిందని, అందుకు మరణశిక్ష విధించారని విమర్శించింది. ఫిబ్రవరి 25న మానసిక సమస్యలతో బాధపడుతున్న మరో ముస్లిం మహ్మద్ ఫయిాజ్‌ను కూడా సమస్తిపూర్‌లో ఇలాగే కొట్టి చంపేశారు. వికలాంగులైనప్పటికీ వారిని కూడా వదిలిపెట్టకుండా చంపేయడానికి మతోన్మాద విష ప్రచారమే కారణమని ఎన్‌పిఆర్‌డి విమర్శించింది. ఇందుకు బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

ఐఎఫ్‌ఎస్ ఫలితాల్లో బాపట్ల విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్



కెవి శ్రీకాంత్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్‌ఎస్) ఫలితాల్లో ఎపి విద్యార్థి సత్తా చాటారు. 2022 సంవత్సరానికిగానూ నిర్వహించిన ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) విడుదల చేసింది. ఈ ఫలితాల్లో బాపట్లకు చెందిన కొల్లూరు వెంకట శ్రీకాంత్ అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. గత ఏడాది జూన్ 20 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన వారికి జూన్ 2023లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. శనివారం ఫలితాలను విడుదల చేశారు. ఇందులో మొత్తం 147 మంది అభ్యర్థులు యుపిఎస్‌సికి ఎంపికయ్యారు. జనరల్ కేటగిరీలో 39 మంది, ఇడబ్ల్యుఎస్ కేటగిరిలో 21, ఓబిసి కేటగిరిలో 54, ఎస్‌సి కేటగిరిలో 22, ఎస్‌టి కేటగిరిలో 11 మంది ఎంపికయ్యారు. అందులో బాపట్లకు చెందిన శ్రీకాంత్ ఆలిండియాలో మొదటి ర్యాంకు సాధించారు. శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

అభాగ్యుల బతుకు 'పోరు కేక'

(కెఎస్‌వి ప్రసాదరావు)

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల హక్కులు, ఇమిడి ఉన్న చట్టాలు, ప్రభుత్వాలు వారికి ఇచ్చిన హామీల సాధన కోసం సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర అప్రతిహతంగా సాగుతోంది. జూన్ 20న ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో ప్రారంభమైన యాత్ర విలీన మండలాల్లోని ముంపు గ్రామాల గుండా 400 కిలోమీటర్లు పదిహేను రోజులపాటు సాగి జులై 4కు విజయవాడ చేరుతుంది. అభివృద్ధికి ఆమడ దూరంలోని ఏజెన్సీలో కొండ కోనల్లో రోడ్లే లేని మారుమూల పల్లెలను యాత్ర స్పృశిస్తోంది. ప్రాజెక్టుతో నిరాశ్రయులై ప్రభుత్వ సాయం దక్కక ఎప్పుడు వరదలొస్తాయోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్న గిరిపుత్రులకు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, పేదలకు ధైర్యం చెపుతూ భరోసా కల్పిస్తూ వారిలో పోరాట స్ఫూర్తిని రగిలిస్తూ పాదయాత్ర కదులుతోంది. సిపిఎం చేపట్టిన మహాపాదయాత్ర నోరులేని వర్గాల గొంతుక. అభాగ్యులకు అండ. జీవన్మరణ పోరాటం. అదొక బతుకు పోరు. మహా పాదయాత్ర పేరే 'పోలవరం నిర్వాసితుల పోరు కేక'.

అధికారం కోసం దండయాత్రలు

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీ ఏదొక యాత్ర సాగిస్తున్నాయి. ఎన్నికల ఏడాదిలో నిర్వహిస్తున్న యాత్రలు కావడంతో విమర్శలు, ప్రతి విమర్శలతో వేడెక్కిస్తున్నారు. అధికార పార్టీ 'గడపగడపకూ వైసిపి' అని ఎమ్మెల్యేలకు, మంత్రులకు



నిర్వాసితుల కష్టాలు తెలుసుకుంటున్న వి శ్రీనివాసరావు (ఫైల్)

రేటింగ్‌లిచ్చి మరీ తిప్పుతోంది. 'జగనన్నే మా నమ్మకం' అనే స్టిక్కర్ల క్యాంపియన్‌ను తోడు చేసింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తరచు పథకాలకు 'బటన్ నొక్కే' యాత్ర చేస్తున్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ 'యువగళం' పేరిట పాదయాత్ర మొదలెట్టారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి, బాదుడే బాదుడు, భవిష్యత్ గ్యారంటీ, నాలుగేళ్ల నరకం, ప్రకాశించని నవరత్నాలు-జగన్‌రెడ్డి మోసపు లీలలు.. అనే క్యాప్షన్స్‌తో రకరకాల ప్రచార యాత్రలు చేస్తున్నారు. ఇక జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ 'వారాహి' యాత్ర కొనసాగిస్తున్నారు. పానకంలో పుడక మల్లే బిజెపి సైతం తానేం తక్కువ తినలేదన్నట్లు వైసిపి ప్రభుత్వంపై ఛార్జిషీట్ పేరిట యాత్రలను లంకించుకుంది. విశాఖపట్నంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, శ్రీకాళహస్తిలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా బహిరంగసభలు నిర్వహించారు. వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి యాత్రల్లో ప్రజా సమస్యలు, జనం ఈతిబాధలు ఏకోశాన కనిపించవు వినిపించవు. కేవలం పదవీ కాంక్ష, ప్రభుత్వంలోకి రావాలన్న రంధి, అధికారాన్ని కాపాడుకోవాలన్న తాపత్రయం దర్శనమిస్తాయి. రాజకీయ వైఖరులు, విధానపరమైన చర్చలు అస్సల్లేవు.

కారు చీకటిలో కాంతి రేఖ

ఇటువంటి రాజకీయ కలుషితంలో పోలవరం నిర్వాసితుల హక్కుల సాధనకు సిపిఎం చేపట్టిన పాదయాత్ర కారుచీకటిలో కాంతి రేఖ. రాజకీయాలంటే, యాత్రలంటే అధికారం కోసమే, సీట్ల కోసమే కాదు ప్రజల కోసం అని నిరూపించింది. పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా అభివర్ణించే పార్టీలు, ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన లక్షల మందికి అన్యాయం తలపెట్టేలా ప్రవర్తించడం ఘోరం. 2005లో ప్రాజెక్టుకు అంకురార్పణ జరగ్గా ఇప్పటికీ నిర్వాసితులకు సహాయ పునరావాసం అందలేదంటే అందుకు ఏలిన వారిదే బాధ్యత. విభజనతో జాతీయ హోదా వచ్చాక నిర్వాసితుల పునరావాసం విషయంలో బిజెపి దోబూచులాడుతోంది. ఐదేళ్లల్లో 70 శాతానికిపైన ప్రాజెక్టును పూర్తి చేశామనే టిడిపి నిర్వాసితులను గాలికొదిలేసింది. నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వం అధిక ప్యాకేజీ అని అమలు చేయలేదు. అశాస్త్రీయ కాంటూర్ లెక్కలు, తొలిదశ, మలిదశ వివాదాలు నిర్వాసితులను రోడ్డున పడేసే ఎత్తులు. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టు పూర్తికి డెడ్‌లైన్లు విధించడంలోనే మోసం ఉంది. నీళ్లొస్తే వారే పోతారనే నిర్లక్ష్యం ప్రభుత్వంలో అణువణువునా జీర్ణించుకుంది. కొద్దిపాటి వరదలొచ్చినా అంచనాలకు మించి ఊళ్లు, ఇళ్లు మునుగుతున్నాయి. నిరుడు జులైలో 37 మీటర్ల మేర వరదొస్తే 45 మీటర్ల కాంటూర్ కంటే పై గ్రామాలు మునిగాయి. నెలల తరబడి గిరిజనం కొండలు, గుట్టలపై బతుకీడ్చాల్సొచ్చింది. ముంపు గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి నిలిచిపోయింది. పునరావాస కాలనీలు, మౌలిక సదుపాయాలు పూర్తి కాలేదు. నిర్వాసితుల బాధలను వెలుగులోకి తెచ్చింది సిపిఎం మహా పాదయాత్ర.

స్పందించాల్సిన తరుణం

పలు వర్గాలు, సంఘాల నుంచి పాదయాత్రకు సంఘీభావం వెల్లువెత్తుతున్నా, ప్రధాన పార్టీల నేతలు ఆ వైపు కన్నెత్తి చూడట్లేదు. స్థానిక నాయకులు సంఘీభావం తెలుపుతున్నారు. ప్రధాన స్రవంతి మీడియా సైతం వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి నేతల యాత్రలపై ప్రత్యేక లైవ్‌లు, నాయకుల తిట్ల దండకాలపై చర్చలతో అమిత ప్రచారం కల్పిస్తూ, 'పోలవరం పోరు కేక'ను విస్మరించడంతో వాటి ప్రాధామ్యాలేమిటో అర్థమవుతోంది. పోలవరం నిర్వాసితుల సమస్య రాష్ట్రం మొత్తానిదీ. ప్రభుత్వాలు, పార్టీలు, యావత్ పౌర సమాజం స్పందించాల్సిన తరుణం.

విశాఖ పోర్టు.. సరికొత్త రికార్డు

- ఒక్క నెలలోనే 63256 టిఇయుల కంటైనర్ హ్యాండ్లింగ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పోర్టు అథారిటీ జూన్ 2023కుగాను ఒక నెలలో అత్యధిక కంటైనర్లను రవాణా చేసి గొప్ప రికార్డు సాధించింది. ఒక్క జూన్‌లోనే 63,256 టిఇయుల కంటైనర్లను హ్యాండిల్ చేసి అత్యధిక సరుకు రవాణా రికార్డును నెలకొల్పింది. గతంలో మే 2023న చేసిన 61,468 టిఇయుల కంటైనర్ల రవాణానే ఇప్పటి వరకూ ఒక నెలలో చేసిన అత్యధిక కంటైనర్ల రవాణా రికార్డుగా ఉండేది. తాజా రికార్డులో సరుకును మొత్తం 49 షిప్పుల ద్వారా పోర్టు హ్యాండిల్ చేసింది.

విశాఖపట్నం పోర్టు అథారిటీ పరిధిలో 2003లో కంటైనరల్ టెర్మినల్‌ను మొదలు పెట్టినప్పటి నుంచి ప్రతి ఏటా అత్యధిక సామర్థ్యాన్ని కనబరుస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి. భారత తూర్పు తీరంలో ఉన్న విశాఖ పోర్టు సహజ సిద్ధంగా ఏర్పడటంతోపాటు అత్యంత లోతైనది కావడంతో భారీ కంటైనర్లను హ్యాండిల్ చేసే అవకాశం కలిగిందని, అందువల్లే ఈ ప్రగతి సాధ్యపడిందని పోర్టు అధికారులు తెలిపారు.

అనుసంధాన్ యువ జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా స్థాపించిన అనుసంధాన్ యువ సంస్థ ఆధ్వర్యంలో శనివారం విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. విశాఖ జిల్లా నలుమూలల నుంచి 4500 మంది ఉద్యోగార్థులు హాజరయ్యారు. జాబ్ మేళాలో 29 సంస్థలు పాల్గొనగా, వాటిల్లో 11 ఐటి సంస్థలు, 18 నాన్ ఐటి సంస్థలు ఉన్నాయి. ఈ మేళాలో అన్ని పరీక్షల అనంతరం 2436 మందికి ఉద్యోగాలు లభించినట్టు అనుసంధాన్ యువ ఫౌండర్ ఎ.సుభాష్ తెలిపారు. ఆగస్టు 10న ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి జాబ్ మేళా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రానున్న రోజుల్లో అగ్రికల్చర్, రెన్యు వల్ ఎనర్జీ, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

స్కూల్ అసిస్టెంట్లుగా ప్రైమరీ హెచ్ఎంలు

- ఆదేశాలు ఇవ్వాలని ఆప్టా వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయు(హెచ్ఎం)లకు అర్హత ఉన్న సబ్జెక్టులలో స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఎ)గా మారే అవకాశం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎజిఎస్ గణపతిరావు, కె ప్రకాష్‌రావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్ హోదాలో కొత్తమంది హెచ్ఎంలు పనిచేస్తున్నారని తెలిపారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో పలు పాఠశాలల్లో హెచ్ఎం పోస్టులు రద్దయ్యాయని తెలిపారు. త్వరలో ఈ పోస్టుల సంఖ్య పూర్తిగా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత ప్రమోషన్ల సమయంలో ఎస్ఎలుగా మారేందుకు అవకాశం ఇవ్వడంతో కొంతమంది మారారని వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లోనూ అనుమతించాలని కోరారు.

కొడికొండ చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ నగదు

- పన్ను శాఖకు అప్పగింత

ప్రజాశక్తి - చిలమత్తూరు

సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు 44 వ జాతీయ రహదారిపై శనివారం పోలీసులు నిర్వహించిన తనిఖీలో భారీస్థాయిలో నగదు పట్టుబడింది. పట్టుబడిన సొమ్ము రూ.1,15,48,500గా గుర్తించారు. కొడికొండ చెక్‌పోస్టు వద్ద బెంగళూరు వైపు నుండి అనంతపురం వైపు వెళ్తున్న ఓ స్కార్పియో వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. అందులోని డబ్బును స్వాధీనం చేసుకున్నారు. కారులోని వ్యక్తులు అనంతపురం జిల్లా ఆత్మకూరుకి గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి, ముత్యాలప్ప, ప్రదీప్‌కుమార్‌గా గుర్తించారు. అయితే పట్టుబడిన సొమ్ము ఎవరిది? ఇంత డబ్బును ఎక్కడి నుండి తీసుకొస్తున్నారు అన్న విషయాన్ని పోలీసులు వెల్లడించలేదు. పట్టుబడిన సొమ్మును రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆదాయపు పన్ను శాఖకు అప్పగించామని హిందూపురం పోలీసులు తెలిపారు.

భారాలు ఉపసంహరించకపోతే

మరో విద్యుత్ ఉద్యమం

- వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఏలూరు టౌన్

రాష్ట్రంలో పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర శుక్రవారం రాత్రి ఏలూరు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక సూర్య కన్వెన్షన్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగాయని, డబుల్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్‌ను అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ, పోలవరం పునరావాస కాలనీల్లోని గిరిజనుల నుంచి విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే, పోలవరం నిర్వాసితులైనా ఎస్‌సి, ఎస్‌టి సర్టిఫికెట్లు ఉన్న వారికే రాయితీ ఇస్తామంటున్నారని చెప్పారు. సచివాలయాల ద్వారా సర్టిఫికెట్లు ఇంటికే వస్తాయని ప్రభుత్వం చెబుతోందని, పోలవరం నిర్వాసితులకు ఇది ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. నిర్వాసితులను పునరావాస కాలనీలకు తెచ్చింది ప్రభుత్వమే కదా అని నిలదీశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి అర్హులందరికీ ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిర్వాసితుల పట్ల నిలువెత్తు నిర్లక్ష్యం

రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం తక్షణమే పునరావాసం కల్పించాలని, పరిహారం ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ జూన్ 20 నుండి మహా పాదయాత్ర నిర్వహిస్తున్నామని శ్రీనివాసరావు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు మేలు చేకూరనుందని తెలిపారు. ఆ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను నిలువెల్లా ముంచడం దారుణమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టని, నిర్వాసితుల సమస్యల కూడా జాతీయ సమస్యేనని పేర్కొన్నారు. ఇటీవల ప్రాజెక్ట్‌లోకి 31 నుంచి 37 మీటర్ల నీరు చేరగానే 190 గ్రామాలను వరద ముంచెత్తిందని తెలిపారు. దీనినిబట్టి ప్రభుత్వం చెప్తున్న కాంటూరు లెక్కలు తప్పుల తడకని స్పష్టమవుతోందన్నారు. ఇవి గోదావరి వరదలు కావని, కేవలం లోపాల వల్ల వచ్చిన వరదని అభివర్ణించారు. 1986, 2022 వరదల్లో మునిగిన గ్రామాలకు మొత్తం పరిహారం ప్రకటించాలని, 2003 భూ సేకరణ చట్టప్రకారం పరిహారం, భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఇస్తానన్న రూ.5 లక్షలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. భూ పరిహారం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. నిర్వాసితులకు ఇచ్చిన ఇళ్లన్నీ నాసిరకంగా ఉన్నాయన్నారు. 15 పునరావాస కాలనీలు నిర్మించినా ఒక్కచోట కూడా తగిన సౌకర్యాలు లేవని తెలిపారు. బిల్లులు ఇవ్వక నిర్మాణాలు పూర్తిగా సాగలేదని, దీంతో, మధ్యలో నిలిచిపోయిన ఇళ్లకు వాడిన ఐరన్ తుప్పుపట్టి పాడైపోయాయన్నారు. కనీసం స్మశాన వాటిక సదుపాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిడబ్ల్యుసి, పోలవరం అథారిటీ కళ్లు మూసుకుని అనుమతులు ఇస్తున్నాయా? అని ప్రశ్నించారు. డాం వాల్ కుంగడం ఎవరి లోపమని, డయాఫ్రాం వాల్ రంధ్రాలు పూడ్చడానికి రూ.2000 కోట్లు వెచ్చిస్తున్నారని, ఇది ఎవరు తిన్నట్టని ప్రశ్నించారు. కాఫర్ డ్యాం లీకేజీలు ఎవరి పాపమో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో గ్రామ సభలు పార్లమెంట్‌తో సమానమని తెలిపారు. గ్రామసభలు నిర్వహించకుండా తూతూమంత్రంగా చేస్తున్నారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు. విలేకర్ల గోష్టిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నాయకులు పి.కిషోర్, కె.శ్రీనివాసరావు తదితరులు కూడా పాల్గొన్నారు.

మీ పిల్లలకు ఇలానే విద్య నేర్పుతారా?

- పాఠశాలల తనిఖీలో రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కడప జిల్లా)

విద్యార్థులను నిలబెట్టి చదువు నేర్పుతున్న ఉపాధ్యాయుడిపై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలకు ఇదే విధంగా విద్యను నేర్పుతారా?... మనస్సాక్షితో పని చేయండి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులను తరగతిలో నిలబెట్టి పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడిపై మండిపడ్డారు. నాడు, నేడు పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఎందుకింత ఆలసత్వం వహిస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారులు, సచివాల సెక్రటరీలు నిద్ర పోతున్నారా? అని ప్రశ్నించారు. విద్యావ్యవస్థలో మార్పులు రావాలంటే ప్రక్షాళన చేయాలని అన్నారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులు యూనిఫామ్ ఎందుకు వేసుకుని రాలేదని ప్రశ్నించగా, టైలర్ దగ్గర ఉన్నాయని ఉపాధ్యాయులు సమాధానమిచ్చారు. అనంతరం కలపపాడు మండలంలోని బాలుర, బాలికోన్నత పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీ చేశారు. పనులు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నవా? లేవా?అని పరిశీలించారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి, సచివాలయ సెక్రటరీ రఘురాములు, డిఇఒ రాఘవరెడ్డి, ఎస్-ఎస్ఎ పిఒ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ఆర్ఐఒ రమణ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలందరూ బడిలో ఉండాలి

- టెన్త్, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు కూడా
- పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పిల్లలందరూ బడిలో తప్పకుండా చేరేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్దేశించినట్లుగా విద్యార్థుల నమోదు 100శాతం పూర్తిచేయడానికి రాబోయే 15 రోజులు చాలా కీలకమని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2005 సెప్టెంబర్ 1 నుంచి 2018 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలో గానీ, కళాశాలలో గానీ ఉండాలని తెలిపారు. వంద శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఇఆర్) ఉండాలనే లక్ష్యం ఉండాలని జిల్లాలోని వాలంటీర్లందరికీ తెలపాలని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కానీ విద్యార్థులను మరలా పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. విద్యార్థి సమాచార పోర్టల్‌లో విద్యార్థులందరి పేర్లను నమోదు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల నమోదుపై రాష్ట్రకార్యాలయం నుంచి జోన్లు వారీగా అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. కడప జోన్ పరిధిలోని కలెక్టర్లను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, గుంటూరు జోన్ కలెక్టర్లను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, విశాఖపట్నం జోన్ కలెక్టర్లను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్‌గౌర్, కాకినాడ జోన్ కలెక్టర్లను పాఠశాల విద్యాశాఖ మౌలిక సదుపాయాల కమిషనర్ భాస్కర్ పర్యవేక్షిస్తారని వివరించారు. ప్రతి రోజూ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గానీ, టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడతారని తెలిపారు.

మహిళలపై హింసను అరికట్టేందుకు

ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన మహిళా నాయకులు

మహిళలపై హింసను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానించి కార్యాచరణ రూపొందించాలని మహిళా ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. మహిళలపై దాడులకు వ్యతిరేకంగా శనివారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో మహిళా సంఘాల ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ కర్నూలు జిల్లా కోసిగి మండలంలో ఒక ఉపాధ్యాయురాలిపై అత్యాచారయత్నం చేయడం సమస్య తీవ్రతను వెల్లడిస్తుందని తెలిపారు.

ఈ దారుణస్థితి నుండి బయటపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సెంటర్లు, హెల్ప్‌లైన్లు ఉమ్మడిగా సమన్వయంతో పనిచేసేలా చూడాలన్నారు. అన్ని విద్యాలయాల్లో లింగ సమానత్వాన్ని పెంపొందించేందుకు సిలబస్, స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలని కోరారు. కేంద్రం బ్రిజ్‌భూషణ్ లాంటి నేరస్తుల పట్ల సానుకూలంగా ఉండటం వల్ల మహిళలకు తీవ్ర అభద్రత కలుగుతోందని తెలిపారు. కస్తూర్బా బాలికా విద్యాలయాల పరిధిని పెంచాలని, 19 సంవత్సరాల వరకూ విద్యనందించే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. మద్యం, మత్తు మందులకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. వాగ్దానం మేరకు మద్యం షాపులను మూసివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులను ప్రజలను భాగస్వాములను చేస్తూ హింసకు వ్యతిరేకంగా బాధితులకు అండగా నిలిచేందుకు గ్రీవెన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు.

టివి సీరియళ్లలో హింసను ప్రేరేపించే అంశాలను తొలగించాలని, సెన్సార్ బోర్డు అప్రమత్తంగా ఉండాలని, పోర్న్ సైట్లపై కఠినంగా ఉండాలని డిమాండ్ చేశారు.


మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని మాట్లాడుతూ మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. తులసీచందుపై ట్రోలింగ్‌ను అందరూ ఖండించాలని కోరారు. పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పద్మ మాట్లాడుతూ నేర నివారణ ముఖ్యమని అన్నారు. నేరస్తులను శిక్షించడమే కాకుండా నేరాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాయల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహీన్ మాట్లాడుతూ పేదరికం, ఒంటరి మహిళలు, భార్యాభర్తలు సఖ్యత లేని కుటుంబాల్లో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శారీరక, మానసిక వేదనలకు గురవుతున్నారని అన్నారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు రష్మి మాట్లాడుతూ చదువుల ఒత్తిడే కాకుండా లైంగిక వేధింపుల వల్ల కూడా ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అన్నారు. సమన్విత కార్యదర్శి శమంతకమణి మాట్లాడుతూ మహిళా సాధికారిత ద్వారానే హింసను అధిగమించొచ్చని పేర్కొన్నారు. అనాథ బాలల ఆశ్రమాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆడపిల్లలు ఉన్న క్యాంపస్‌లో గెస్ట్‌హౌస్ ఉండకూడదని పేర్కొన్నారు.

ఛైల్డ్‌వెల్ఫేర్ సొసైటీ సభ్యులు రాధాకుమారి మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో రక్షణ కల్పించే చట్టాల గురించి ప్రచారం నిర్వహించాలన్నారు. డి ఎడిక్షన్ కేంద్రాలను విస్తృతంగా పెట్టాలన్నారు. విద్యావేత్త డాక్టర్ వసుంధర మాట్లాడుతూ సోషల్ మీడియాలో వేగంగా ట్రోలింగ్ చేస్తున్నారని, దీన్ని అరికట్టాలని కోరారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో జమాఅతె ఇస్లామీ అధ్యక్షులు సల్మా షహనాజ్ సుల్తానా, తస్రీమ్, సిఎంఎస్ నుండి మంజరి లక్ష్మి, తెలుగు మహిళ విజయవాడ నగర అధ్యక్షులు ఉషారాణి, సిఐటియు నాయకులు కమల, శ్రామిక మహిళా సంఘం నాయకులు శైలజ, లక్ష్మీదేవి, ఐద్వా నుండి కె.స్వరూపరాణి, కె.శ్రీదేవి, పిఓడబ్ల్యు నాయకులు కనకదుర్గ, మహిళా సమాఖ్య నాయకులు దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో అన్ని గ్రామాల్లోనూ పునరావాసం

- పోలవరం నిర్వాసితుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం
- కెవిపిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగమణి

పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కల్పనకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత నివ్వాలని, ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని కెవిపిఎస్ రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. విజయవాడ బందరు రోడ్డులోని ఎంబివికె లైబ్రరీ హాల్‌లో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన శనివారం దళిత, గిరిజన, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా అమలయ్యే వరకు గ్రామాలు ఖాళీ చేయించరాదని, పునరావాసం పూర్తయ్యేవరకు ముంపు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించాలని, 1986, 2022 నాటి వరద ముంపు గ్రామాలు రీ సర్వే చేయాలని, పునరావాసం దశల వారీగా కాకుండా ఏక కాలంలో అన్ని గ్రామాల్లోనూ పూర్తి చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్ అండ్ ఆర్ పరిహారం అర్హులందరికీ ఇవ్వాలని, ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతి ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించాలని, సిఎం జగన్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసిత కుటుంబానికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా రూ.10.50లక్షలు పరిహారం ఇవ్వాలని, గతంలో ఎకరానికి రూ.1.15లక్షలు పరిహారం తీసుకున్న వారికి మరలా రూ.5లక్షల పరిహారం చెల్లించాలని, సర్వం కోల్పోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కిరణ్ తీర్మానాలను ప్రవేశపెట్టగా, ఆమోదించింది. సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగమణి, హైకోర్టు అడ్వకేట్ పిచ్చుక శ్రీనివాస్, విసికె రాష్ట్ర కోశాధికారి గంజి రామారావు, ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా వరప్రసాద్, దళిత జాగృతి వేదిక రాష్ట్ర అధ్యక్షులు గణేష్, తెలుగు రాష్ట్రాల ఎమ్ఆర్‌పిఎస్ ఛైర్మన్ పేరుపోగు వెంకటేశ్వరరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ముస్లిం మైనార్టీ నాయకులు అమీనా బాషా, వడ్డెర సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజ్, జి.క్రాంతి కుమార్, ఎం.సూర్యారావు, ఐలు నాయకులు అడ్వకేట్ శ్యామ్ పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో కేన్సర్ పరీక్షలు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రులలో కేన్సర్, కార్డియాలజీ చికిత్సలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు తెలిపారు. గుంటూరు జిజిహెచ్‌లోని నాట్కో కేన్సర్ సెంటర్లో శనివారం నిర్వహించిన నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఎపి చాప్టర్ వార్షిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వైజాగ్ కెజిహెచ్, కర్నూలు జిజిహెచ్‌లో ఆరు నెలల్లోగా పూర్తి స్థాయిలో కేన్సర్ చికిత్సలు ప్రారంభమవుతాయని తెలిపారు. భవిష్యత్‌లో కాకినాడ, అనంతపురంలో పూర్తి స్థాయి కేన్సర్ చికిత్సలు ప్రారంభిస్తామని చెప్పారు. కేన్సర్ చికిత్సలో ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులు నేషనల్ కేన్సర్ గ్రిడ్ ఎపి చాప్టర్ కింద ఒకే వేదికపైకి రావాలన్నారు. గ్రామ స్థాయిలో కూడా కేన్సర్ స్క్రీనింగ్ జరగాలని, ఇందుకోసం పైలెట్ ప్రాజెక్టుగా అనకాపల్లి జిల్లాను ఎంపిక చేశామని తెలిపారు. గతేడాదిలో ఆరోగ్య శ్రీ కింద కేన్సర్ చికిత్సకు రూ.600 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని తెలిపారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రతి కేన్సర్ రోగి వివరాలూ నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కేన్సర్‌ను నోటిఫైడ్ డిసిజ్‌గా ప్రభుత్వం ప్రకటించినా ప్రయివేట్ ఆస్పత్రులు నమోదు చేయకపోవడంపై సమీక్షించాలని ఆరోగ్యశ్రీ సిఇఒను కృష్ణబాబు ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కింద కేన్సర్ చికిత్స విషయంలో ప్రయివేట్ ఆస్పత్రులు నిర్ణీత ప్రోటోకాల్‌ను పాటించాల్సిందేని స్పష్టం చేశారు. క్యాన్సర్ చికిత్సకు సేవలందిస్తున్న టాటా మెమోరియల్ ట్రస్ట్‌కు అభినందనలు తెలిపారు. గుంటూరు జిజిహెచ్ నాట్కో కేన్సర్ సెంటర్ ఎ1 స్థాయికి పెంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ సిఇఒ ఎం.ఎన్.హరీందరప్రసాద్, నాట్కో వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, వైజాగ్ హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేష్, డిఎంఇ డాక్టర్ నరసింహం, నాట్కో ప్రతినిధి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ముత్తుకూరు జంక్షన్‌లో మాట్లాడుతున్న నారా లోకేష్

అక్రమార్కులను వదలిపెట్టను : లోకేష్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిని వదిలిపెట్టబోనని, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శనివారం నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం గోపాలపురం నుంచి ప్రారంభమై కాకుపల్లి వరకు సాగింది. ముత్తుకూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. దేశానికే వెలుగునిచ్చే దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్రాజెక్టు, కృష్ణపట్నం పోర్టు సర్వేపల్లి సొంతమన్నారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న సర్వేపల్లి నేలపై పాదయాత్ర చేయడం తన అదృష్టమని తెలిపారు. యువగళం పాదయాత్ర చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వణుకు పుడుతోందన్నారు. వైసిపి నేతలు తనపై అనేక ఆరోపణలు చేశారని, ఏ ఒక్కటీ నిరూపించలేక పోయారని అన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేదని, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా ఇంటికో సత్యానాదెళ్లను ఎలా తయారు చేస్తారని ప్రశ్నించారు. పాదయాత్రలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల సుబ్రమణ్యం, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నివాసం జప్తు దుర్మార్గం: టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసం ఉంటున్న కరకట్ట ఇళ్లు జప్తు చేయడం దుర్మార్గమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు, ప్రతిపక్షం ఉండకూడదని జగన్ ఉద్దేశమా అని ప్రశ్నించారు. చంద్రబాబు అద్దెకు ఉంటున్న ఇళ్లు జప్తు చేస్తే ఇంటి యజమాని లింగమనేని రమేష్‌కు, ప్రభుత్వానికి మధ్యలో చంద్రబాబును ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు కుప్పంలో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వకుండా ఎందుకు ఇబ్బంది పెడుతున్నారో చెప్పాలన్నారు. ముప్పవరపు చౌదరి, లీలా రామకృష్ణప్రసాద్ ట్రస్టు భూములు దోచుకోవాలని చూస్తున్న వైసిపి నేతలపై, ట్రస్టు సభ్యులు శ్రీనివాసరావుపై, అక్రమ కేసులు పెట్టిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు రామయ్య శనివారం లేఖ రాశారు. సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారని పోలీసులు అరెస్టు చేసిన తెలుగు యువత నాయకులు సుదర్శన్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిజిపికి రామయ్య లేఖ రాశారు. అమ్మఒడిని ఆంక్షల సుడిగా జగన్ మార్చారని టిడిపి అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు విలేకరుల సమావేశంలో విమర్శించారు. నాలుగేళ్లల్లో తల్లులకు రూ.9300కోట్లు ఎగ్గొట్టారని ఆరోపించారు.

వాస్తవాల్ని దాచి కోర్టు ధిక్కార కేసు వేస్తారా?

- ఉద్యోగికి రూ.25 వేలు జరిమానా విధించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

కోర్టుకు వాస్తవాలు దాచిపెట్టి కోర్టుధిక్కార కేసు వేసిన ప్రభుత్వ ఉద్యోగికి హైకోర్టు రూ.25 వేలను జరిమానా విధించింది. కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. నాలుగు వారాల్లోగా ఆ మొత్తాన్ని ఎపి హైకోర్టు న్యాయవాదుల సంఘం పేరిట జమ చేయాలని ఇటీవల జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ తీర్పు చెప్పారు. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన ఎపి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌పిడిసిఎల్) ఉద్యోగి అంబటి శ్రీనివాసులు నాయుడుని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీనిని హైకోర్టు రద్దు చేయడంతో అధికారులు అతనిని విధుల్లోకి తీసుకుని ఉదయగిరికి బదిలీ చేశారు. కోర్టు ఉత్తర్వుల్ని అధికారులు అమలు చేయలేదంటూ నాయుడు వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది.

పిల్లలు ఇష్టప్రకారం తండ్రి వద్ద ఉండొచ్చు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

తండ్రి వద్ద పిల్లలు స్వచ్ఛందంగా, ఇష్టప్రకారం ఉంటే అది అక్రమ నిర్బంధం కాదని హైకోర్టు తీర్పు చెప్పింది. తండ్రి సహజ సంరక్షకుడిగా పిల్లలను తన వద్ద ఉంచుకునే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. తన పిల్లలను తన భర్త అక్రమంగా నిర్బంధించారని ఒక మహిళ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కొట్టేస్తూ జస్టిస్ సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ టి. రాజశేఖరరావు ధర్మాసనం ఇటీవల తీర్పు చెప్పింది. తన పిల్లలను భర్త డాక్టర్ భానుమూర్తి అక్రమంగా నిర్బంధించారని, వారిని కోర్టులో హాజరుపర్చేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ చిత్తూరు జిల్లాకు చెందిన దేవప్రియ శిరీష హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కృష్ణా జిల్లా ఎస్‌పి 17 ఏళ్ల అమ్మాయిని, ఏడేళ్ల అబ్బాయిని డివిజన్ బెంచ్ ఎదుట హాజరుపర్చారు. వాళ్లతో జడ్జిలు వ్యక్తిగతంగా మాట్లాడారు. తండ్రి బలవంతంగా తనను తీసుకెళ్లలేదని, వేసవి సెలవులకు వెళ్లానని కూతురు చెప్పింది. కొడుకు కూడా తండ్రి వద్దే ఉంటానని చెప్పారు. దీంతో హైకోర్టు పైవిధంగా తీర్పు చెప్పింది.

7.5 లక్షల మందికి ఉపాధి : సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 1.50 లక్షల ఎంఎస్ఎంఇ యూనిట్లను నెలకొల్పడం ద్వారా 7.50లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించామని, అందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎంఎస్ఎంఇ రంగంపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2022-23లో రూ.15,625 కోట్లతో 1.25 లక్షల యూనిట్లు నెలకొల్పి, 1.56లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు రూ.9.677 కోట్లతో 62శాతం లక్ష్యసాధనతో 92,707 యూనిట్లను, 75శాతం లక్ష్యసాధనతో 3.61 లక్షల మందికి ఉపాధి కల్పించి ఉపాధి కల్పనలో 231 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు సిఎస్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎంఎస్ఎంఇ యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన భూముల గుర్తింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకునేలా కలెక్టర్లతో మాట్లాడాలని పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌ను సిఎస్ ఆదేశించారు. ఎంఎస్ఎంఇ క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద ఏర్పాటు చేస్తున్న వివిధ యూనిట్లను అక్టోబరు 2న ప్రారంభించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమలశాఖ అధికారులకు సూచించారు. ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఇ యూనిట్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక జిల్లా ఒక ప్రొడెక్టు అనే విధానం కింద ప్రతిజిల్లా నుంచి కనీసం రెండు మూడు ఉత్పత్తులను గుర్తించి ఆ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని పరిశ్రమలశాఖ, చేనేత, జౌళిశాఖ అధికారులను సిఎస్ ఆదేశించారు. అంతకుముందు రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనరు కె.ప్రవీణ్ కుమార్ ఎంఎస్ఎంఇ రంగంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, పరిశ్రమలశాఖ జెడి రామలింగేశ్వరరాజు పాల్గొన్నారు.

వాచ్ అండ్ వార్డ్ ఉద్యోగులకు జీతాలివ్వండి : ఎపిజెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూశాఖలో శ్రీకాకుళం, అనంతపురం, కృష్ణా, కర్నూలు జిల్లాల్లో పనిచేస్తున్న వాచ్ అండ్ వార్డ్ ఉద్యోగులకు రెండేళ్లుగా జీతాలు చెల్లించడం లేదని, వెంటనే బకాయిలు చెలించాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వైద్యారోగ్యశాఖ కొత్తగా ఏర్పాటు చేసిన బోధనాసుపత్రుల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను 2022 అక్టోబరులో నియమించినా నేటికీ జీతాలు అందలేదన్నారు. ఎపి కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ కె.సుమన్ అధ్యక్షతన విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో బొప్పరాజు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఎపి జెఎసి అమరావతి కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు, పూర్వపు కార్యదర్శి బానోజిరావు, కో ఛైర్మన్ అనిల్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ దివాకర్‌బాబు, పలు సంక్షేమశాఖల ఉద్యోగ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏలూరులో పోలవరం పోరుకేక మహా పాదయాత్ర అగ్రభాగాన ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శన



ఏలూరు బహిరంగ సభలో సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీలు, సంఘాల నేతలు

ముంచాలని చూస్తే దించేస్తారు

- పోలవరం నిర్వాసితుల బాధ్యత నుంచి కేంద్రం తప్పించుకోవడం దారుణం
- నెత్తిన పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- ఏలూరు, హనుమాన్ జంక్షన్ సభల్లో శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఏలూరు, అర్బన్, కృష్ణా ప్రతినిధులు

నిర్వాసితులకు పరిహారం అందించకుండా ముంచాలని చూస్తే బిజెపి, వైసిపిలను ప్రజలు దించేస్తారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. పోలవరం పోరుకేక పాదయాత్ర 12వ రోజు శనివారం జిల్లా కేంద్రమైన ఏలూరులో ప్రారంభ కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా ఏలూరులోని ఆర్ఆర్‌పేట పార్క్ వద్ద సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, హనుమాన్ జంక్షన్‌లో సిపిఎం కృష్ణా జిల్లా బాపులపాడు మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు అధ్యక్షతన సభలు జరిగాయి. ఈ సభల్లో శ్రీనివాసరావు మాట్లాడుతూ 12 రోజులుగా సాగుతున్న ఈ పాదయాత్ర నిర్వాసితుల కడుపు మంట యాత్రగా అభివర్ణించారు. పదేళ్ళుగా చూసి విసిగిపోయి ఏదోకటి తేల్చుకోవాలనే కసితో ఆదివాసీలంతా యాత్ర చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసిత గ్రామాలను పూర్తిగా గాలికొదిలేశాయని, రోడ్లు నరకప్రాయంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే పోర్టులు, రోడ్డు వంటివాటిని మింగేస్తున్న అదాని... ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో ఆయిల్ ఫ్యాక్టరీ పెట్టి కబళించాలని చూస్తున్నారన్నారు. ఈ మండలంలో ఆరు వేల ఎకరాలు సేకరించి నిర్వాసితులకు కాలనీలు కడుతున్నారని తెలిపారు. పరిహారం ఇవ్వకపోవడంతో ఇప్పటి వరకూ 20 శాతానికి మించి కుటుంబాలు రాలేదని తెలిపారు. ఇది రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల ప్రజల సమస్య కాదని, 175 నియోజకవర్గాల ప్రజల సమస్యని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకూ పోలవరం ప్రాజెక్టు వల్ల మేలు కలుగుతుందన్నారు. ఈ దృష్ట్యా నిర్వాసితుల పోరాటానికి ఆయా జిల్లాల వారంతా సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రధాన మంత్రి మోడీ వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో జగన్ బాధ్యత వహించాలని అన్నారు. నిర్వాసితుల సమస్య పరిష్కారం పూర్తి కాకుండా పోలవరం ప్రాజెక్టు పూర్తి కాదన్నారు. పోలవరం డిజైన్లన్నీ పనికిమాలినవని, దీనిపై ఏ ఇంజనీర్‌తోనైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. తొలివిడతగా 20 గ్రామాలు మునక అని చెప్పి, ఇప్పుడు 36 గ్రామాలను చేర్చారని, దీంతో, లెక్కలు తప్పని తేలిపోయిందని తెలిపారు. ప్రాజెక్టు అంతా తప్పుల తడకగా కొనసాగుతోందన్నారు. నిధులను కాంట్రాక్టర్లు, మంత్రులు, నాయకులు పంచుకుంటున్నారని విమర్శించారు. ప్రతిపైసా ముందుగా నిర్వాసితులకు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సిఎం స్వయంగా వెళ్లి చూసి వైసిపి నాయకులను అడిగి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఏజెన్సీలో గ్రామ సభలకు ప్రత్యేక హక్కులున్నాయని, వాటిని కాదని ఫ్యాక్టరీ పెట్టిస్తున్నారని అన్నారు. వరద సాయం కింద రూ.పది వేలు ఇస్తామని చెప్పి పది పైసలు కూడా విదల్చలేదన్నారు. ఇస్తే లెక్కలతో చెప్పాలన్నారు. భూములకు రూ.ఐదు లక్షల పరిహారం, పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు ఏ ఒక్కటీ ఇవ్వలేదన్నారు. కొత్తగా ఫ్యామిలీ ప్యాక్ తెచ్చి నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 2013 భూ సేకరణ చట్టప్రకారం 18 ఏళ్ళు నిండిన యువతను యూనిట్‌గా పరిగణించి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 41.15, 45.72 కాంటూరు లెక్కలన్నీ పక్కన పెట్టి పరిహారం అందించాలని కోరారు. నిర్వాసితుల సమస్య తన బాధ్యత కాదన్నట్టు కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెత్తిన వేసుకుంది గనుక సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరంపై పదిసార్లు సమీక్ష చేసినా నిర్వాసితుల గురించి ముఖ్యమంత్రి మాట్లాడక పోవడం శోచనీయమన్నారు. ఇదేనా అభివృద్ధి, సుపరిపాలన అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు కులం, మతం పేరుతో సొల్లు కబుర్లు చెబుతారని, కేంద్రంలోని తమ నాయకుడు మోడీని మాత్రం నిర్వాసితుల సమస్య గురించి అడగరని అన్నారు. బిజెపికి రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన అడుగులొత్తడం దారుణమని పేర్కొన్నారు. బిజెపిని ప్రజలు ఛీకొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ నెల నాలుగో తేదీన విజయవాడలో మహా ధర్నా అనంతరం కార్యాచరణ ప్రకటిస్తామని, ప్రభుత్వం దిగిరాకపోతే ప్రతి గ్రామాన్ని సమర క్షేత్రంగా మారుస్తామని తెలిపారు. హనుమాన్ జంక్షన్‌లో రోడ్ల విస్తరణ సమయంలో సిపిఎం పోరాడి న్యాయమైన పరిహారం ఇప్పించేందుకు కృషి చేసిందని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యను మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల తరుపున సంఘీభావం ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర నేత వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం నాటకాలాడుతోందని, నిజమైన దొంగ మోడీయేనని అన్నారు. 25 ఎంపి సీట్లు ఇస్తే తన సత్తా చూపిస్తానని, కేంద్రం మెడలు వంచుతానని చెప్పిన జగన్... లోక్‌సభ, రాజ్యసభలో 30 మంది ఎంపిలున్నా నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు. జులై 17 నుంచి పార్లమెంట్ సమావేశాలు ఉన్నాయని, నిర్వాసితుల సమస్యలపై వైసిపి ఎంపిలు మాట్లాడతారో, లేదో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్‌కు ప్రజలు ఆశీస్సులు కావాలో, మోడీ ఆశీస్సులు కావాలో తేల్చుకోవాలన్నారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం అమలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఓట్లు, సీట్ల కోసం సాగుతున్న పాదయాత్ర కాదన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పోరాటానికి రాష్ట్రంలోని కార్మిక వర్గం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం రాష్ట్ర నాయకులు, కె.ధనలక్ష్మి, కె.ఉమామహేశ్వర రావు, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సిపిఐ నాయకులు దేగా ప్రభాకర్, మన్యం కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు. ఏలూరులో పాదయాత్రకు టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్, ఆలిండియా లాయర్స్ యూనియన్, చేతివృత్తిదారుల సంఘంతోపాటు పలు సంఘాల నేతలు ఘనస్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. తంగెళ్లమూడి వంతెన వద్ద మహిళలు హారతులిచ్చి, పూలు చల్లి పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు.

ఆయన ఇవ్వడం లేదు... ఈయన అడగడం లేదు : కె రామకృష్ణ

పోలవరం నిర్వాసితులకు పరిహారం కింద రూ.30 వేలు కోట్లు ఇవ్వాల్సి ఉందని, కేంద్రం నిధులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ప్రధాని మోడీ ఇవ్వడం లేదని, సిఎం జగన్ అడగడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఏలూరులో పోలవరం పోరుకేక మహా పాదయాత్ర'కు ఆయన, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. పాదయాత్ర బృందంతో కలిసి నడిచి ఆర్ఆర్‌పేట పార్క్ వద్ద జరిగిన బహిరంగ సభలో పాల్గొని రామకృష్ణ మాట్లాడారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు ఇళ్లు, భూమి, ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు, మేధావులు, రాజకీయ పార్టీలు నిర్వాసితుల సమస్యలపై మాట్లాడాలని కోరారు. నిర్వాసితుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. మళ్లీ వరదలు వస్తే నిర్వాసితులు కొండలు, గుట్టలు ఎక్కాల్సిన దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మొదలై దశాబ్ద కాలం గడిచినా నిర్వాసితులకు ఇళ్లు, పరిహారం, ఉపాధి చూపించలేదన్నారు. మోడీని నిధులు అడిగే పరిస్థితిలో జగన్ లేరని విమర్శించారు. ఢిల్లీ వెళ్లి ఆయనను, ఆయన తమ్ముడు కేసుల గురించి మాట్లాడుకొని వస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. బిజెపి వాళ్లు బఫూన్లని అభివర్ణించారు. ఢిల్లీలో రాష్ట్ర బిజెపి నాయకులు నిర్వాసితుల గురించి అడగడం లేదన్నారు. వెంటనే కేంద్రం నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.30 వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. 12 రోజులుగా పాదయాత్ర చేస్తున్న బృందానికి అభినందనలు తెలిపారు.

'నారాయణ'లో పుస్తక విక్రయాలు అడ్డగింత

- చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం పట్టణం న్యూ కాలనీలోని నారాయణ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పుస్తకాలను ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం అడ్డుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, నాయకులు సంతోష్, తిరుపతి, రేవతి కళాశాల ప్రాంగణానికి వస్తున్నారన్న సమాచారంతో కళాశాల యజమాన్యం గేట్లకు తాళం వేసింది. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాల ఎజిఎం తిరుపతిరావు, ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులను లోపలికి అనుమతించడంతో వారు విద్యార్థులతో మాట్లాడారు. పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు చేపట్టే కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై పుస్తకాలు, యూనిఫాం అమ్మబోమని ఎజిఎం తిరుపతిరావు హామీ ఇవ్వడంతో నాయకులు వెనుదిరిగారు.

పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పోరాటానికి సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన సమస్యల పరిష్కారం కోసం పిఎసిఎస్ ఉద్యోగులు చేస్తున్న ఉమ్మడి పోరాటానికి సిఐటియు రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో 50శాతం వాటాలను ప్రైవేటీకరించడాన్ని, రైతు భరోసా కేంద్రాలను పిఎసిఎస్‌ల్లో విలీనం చేయడాన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల చేతుల్లో ఉన్న సంఘాలను ప్రైవేట్ పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. 1964 సహకార సంఘాల చట్టానికి చేసిన సవరణలను ఉద్యోగులు కోరుతున్న విధంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2014 ఏప్రిల్ 1 నుంచి చేయాల్సిన వేతన సవరణ ఇంతవరకు టిడిపి, వైసిపి ప్రభుత్వాలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం పూనుకొని 2014, 2019 నుంచి అమల్లోకి రావాల్సిన వేతన సవరణలను వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఇతర ఆర్థిక కోర్కెలను కూడా పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారం అయ్యేంత వరకు జరిగే ఐక్య పోరాటానికి మద్దతుగా నిలబడతామని హామీ ఇచ్చారు. ఈ నెల 3వ తేదీన రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు ఉద్యోగులు ధర్నా చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 17న చలో విజయవాడకు ఐక్యవేదిక పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. ఈ ఆందోళనలకు మద్దతుగా నిలవాలని అన్ని కార్మిక, రైతు సంఘాలకు విజ్ఞప్తి చేశారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

అంగన్‌వాడీల సమస్యలపై 36 గంటల ధర్నా

- ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐసిడిఎస్‌ను పరిరక్షించాలని, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10,11న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద 36 గంటల పాటు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. అంగన్‌వాడీల కోర్కెల దినంగా జులై 10న పాటిస్తూ దేశ వ్యాప్తంగా పోరాటం ఉధృతం చేయాలని అఖిల భారత కమిటీ పిలుపునిచ్చిందని చెప్పారు. విజయనగరంలోని ఎన్‌పిఆర్ భవనంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లయినా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లను కుదించడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయని, కానీ ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పోరాటాల ఫలితంగా 2018 లో అంగన్‌వాడీ వర్కర్లకు రూ.1500, హెల్పర్లకు రూ. 750, మినీ వర్కర్స్‌కు రూ. 1250 పెంచుతున్నామని ప్రకటన చేసినా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. 1972 చట్టం ప్రకారం అంగన్‌వాడీలు గ్రాడ్యూటీకి అర్హులని సుప్రీం కోర్టు తెలిపినా ప్రభుత్వాల అమలు చేయడం లేదని విమర్శించారు. పైగా లబ్ధిదారులను కుదించటానికి పోషణ ట్రాక్ యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పేరుతో అధికారులు, రాజకీయ నాయకులు అంగన్‌వాడీలను వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టే ఈ ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్ అనసూయ, నాయకులు ప్రభావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు జిల్లా)



విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన ఏలూరు జిల్లా మండవల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. పెనుమిల్లకు చెందిన పడమటి రామకృష్ణ (51) మండవల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయనను బందరులోని పాతనేరస్తుల కదలికలు తెలుసుకునేందుకు పంపారు. మధ్యాహ్న సమయంలో గుండెనొప్పి రావడంతో బందరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని ఎఎస్‌పి ఎంజెవి.భాస్కర్‌రావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

- పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన
- పోలీసుల లాఠీఛార్జ్

ప్రజాశక్తి -ఖాజీపేట

ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ సంఘటన కడప జిల్లా ఖాజీపేట మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రుల వివరాల మేరకు.. పులివెందులకు చెందిన నాగరాజు, లలిత దంపతుల కుమారుడు సోహిత్ (11) బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. సోహిత్ కడుపు నొప్పితో బాధపడుతున్నాడంటూ తల్లిదండ్రులకు స్కూలు యాజమాన్యం శనివారం ఉదయం సమాచారమిచ్చారు. వారు చెన్నూరులో తమ బంధువులకు తెలపగా వారు విద్యార్థిని ఆస్పత్రికి తీసుకెళ్లిన కొద్దిసేపటికి మరణించారు. సోహిత్ శరీరంపై గాయాలు ఉండటాన్ని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గమనించి పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా, తమకు తెలియదని యాజమాన్యం చెప్పింది. తమకు న్యాయం జరగాలని పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. విద్యార్థి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఉన్నతాధికారులతో న్యాయ విచారణ జరిపించాలని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. యాజమాన్యం స్పందించకపోవడంతో పాఠశాల తలుపులు, కిటికీలను ధ్వంసం చేశారు. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాల మూసివేతకు విద్యా శాఖ ఆదేశాలు

విద్యార్థి మృతి కారణంగా పాఠశాల అనుమతులు రద్దు చేస్తూ డిఇఒ రాఘవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు సభ్యులతో కూడిన నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉత్తర్వులను తక్షణం అమలయ్యేలా చర్యలు చేపట్టారు. ఆదివారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. బీరం శ్రీధర్‌రెడ్డి విద్యా సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

వడదెబ్బకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పలాస

వడదెబ్బకు గురై ఇద్దరు మృతి చెందిన ఘటన శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో శనివారం చోటు చేసుకుంది. బొడ్డపాడు గ్రామానికి చెందిన గవరయ్య (55) జీడితోటలో పనికి వెళ్లాడు. సాయంత్రమైన ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు తోటకు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బకు గురై మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. లాబాంకు గ్రామానికి చెందిన వికలాంగుడు పారయ్య(52) నాగావళి నదిలో స్నానం చేయడానికి బయలుదేరాడు. అయితే ఎండ తీవ్రతకు తాళలేక దారి మధ్యలోనే మరణించాడు. ఇంటికి రాకపోయేసరికి గ్రామస్తులు నది పరిసర ప్రాంతాల్లో

పవన్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు : మంత్రి అంబటి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యక్తిగత జీవితాన్ని బయటపెడతానంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో మోడీ, అమిత్ షా వంటి పెద్దలు తెలుసంటూ బ్లాక్ మెయిల్ చేస్తే సహించబోమన్నారు. ఢిల్లీ పెద్దలే కాదని, రష్యాలో ఉన్న పవన్ సంబధికులూ తమకు తెలుసన్నారు. జగన్‌పై పవన్ కల్యాణ్‌కు ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. జగన్ వల్ల పవన్ కల్యాణ్‌కి వచ్చిన నష్టమేమిటని నిలదీశారు. కులాల గురించి ప్రస్తావించనని చెబుతూనే పవన్ కల్యాణ్ నిత్యం కులాల గురించి మాట్లాడుతున్నారని తెలిపారు. వారాహి వాహనం పైనుంచి అసత్యాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాపులను చంద్రబాబుకు తాకట్టు పెట్టడం తప్ప పవన్ కల్యాణ్‌కి ఏమి చేతకాదని దుయ్యబట్టారు. కమ్యూనిస్టు నాయకులు, విప్లవకారుల పేర్లు చెప్పుకుంటూ తాను విప్లవం సృష్టిస్తానని పవన్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గోదావరి జిల్లాలో వైసిపి ఒక సీటులో కూడా గెలవనివ్వనని చెప్పే పవన్ కల్యాణ్ సొంతంగా ఎన్ని సీట్లకు పోటీ చేస్తారో చెప్పగలరా? అని సవాల్ విసిరారు.

సంపాదకీయం


వారు ఒంటరి కాదు

'హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్ / తత్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే' అంటే...'బంగారు మూతతో సత్యం యొక్క ముఖం కప్పబడి వుంటుంది. నువ్వు దాన్ని తొలగించి, సత్యంవైపు నడిపించు' అని అర్థం. సత్యం తాత్కాలికంగా కప్పబడిపోవచ్చు. నిప్పుకణికలా అది రగులుతూనే వుంటుంది. ఏదోక సమయంలో భగ్గుమని మండుతుంది. ఈ దేశంలో అసహనం ఎంత హద్దు మీరుతున్నదో... ఆ అసహనాన్ని ఎదురించే శక్తులు, నిరసన గళాలు అంతే ఉవ్వెత్తున లేస్తుంటాయి. ప్రశ్నించేతత్వం, పోరాడేతత్వం లేనిచోట బానిసత్వం, నిరంకుశత్వం రాజ్యమేలుతుంది. 'ఇరుగు పొరుగుల్ని ఎద్దేవా చెయ్యడమెందుకు... అధికార మదాంధుల్ని, నియంతల్ని, మన మీద సవారీ చేస్తున్న దుర్మార్గుల్నీ ఎద్దేవా చెయ్యి' అంటాడు విఖ్యాత రష్యన్ రచయిత నికొలాయ్ గొగోల్. ప్రశ్నించేతత్వం, స్వేచ్ఛ మనిషికి రెండు రెక్కల్లాంటివి. ప్రశ్నించే గుణం నుంచే అభివృద్ధికి బాటలు పరుచుకున్నాయి. ఆ ప్రశ్నకు స్వేచ్ఛ వుంటేనే అది ఆకాశంలో పక్షిలా స్వతంత్రంగా మనగలుగుతుంది. స్వేచ్ఛకు సంకెళ్లు పడితే... సృజనకు విఘాతం కలుగుతుంది. ప్రశ్నించేతత్వం చచ్చుబడిపోతుంది. స్వేచ్ఛకు ఎక్కడైతే సంకెళ్లు పడతాయో, ప్రశ్నించేగళాలకు ఎక్కడైతే అడ్డుతగులుతారో... అక్కడే నిరసన జ్వాలలు నిప్పుకణికల్లా భగ్గుమంటాయి.

'మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి... కానీ, ప్రతి చోటా సంకెళ్లలో చిక్కుకుంటున్నాడు' అంటాడో కవి. రోజురోజుకూ మతతత్వం కోరల్లో చిక్కుకుంటున్న సమాజంలో చైతన్యాన్ని రగిలించడం కోసం, నిరంకుశత్వాన్ని ఎదిరించడం కోసం నడుంకట్టిన అభ్యుదయవాదులపై దేశ ద్రోహం ముద్ర పడుతోంది. వారి రాజకీయ కుతంత్రాలను బయటపెట్టే ప్రగతిశీల శక్తులపై దాడులకు పాల్పడుతున్నారు. అబద్ధాల పునాదుల మీద నిర్మించుకున్న అద్దాల మేడ ఎక్కడ కుప్పకూలి పోతుందోనని బెంబేలెత్తిపోతున్నారు. 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం/ నరజాతి చరిత్ర సమస్తం/ పరపీడన పరాయణత్వం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. ప్రశ్నించేవారిని దేశద్రోహులుగా, ఉగ్రవాదులుగా ముద్రలు వేసి, బెయిల్ కూడా రాని 'ఉపా' వంటి కఠిన చట్టాల ద్వారా నిర్బంధిస్తున్నారు. నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే, గౌరీ లంకేష్, ఎం.ఎం.కల్బుర్గిని నిర్దాక్షిణ్యంగా హతమార్చారు. స్టాన్ స్వామిని బలితీసుకున్నారు. ప్రొఫెసర్ సాయిబాబు, వరవరరావు తదితరులను జైలు పాలు చేశారు. తాజాగా భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌ను తుపాకీతో కాల్చి గాయపరిచారు. స్వతంత్ర జర్నలిస్టు తులసీ చందు మోడీపైనా, బిజెపిపైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్న కారణంగా...ఆమెపై ట్రోలింగ్ చేస్తున్నారు. అమెరికా శ్వేతసౌధంలో భారత్‌లోని మానవహక్కుల ఉల్లంఘనలపై ప్రధాని మోడీని ప్రశ్నించిన వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు చెందిన సబ్రినా సిద్ధిఖీపై వేధింపులు మొదలయ్యాయి. పాకిస్తాన్ ఇస్లామిస్ట్ అంటూ ఆమెపై ముద్ర వేశారు.

'అధికారానికి వ్యతిరేకంగా మనిషి చేసే పోరాటమంటే/ మరచిపోవటానికి వ్యతిరేకంగా జ్ఞాపకం చేసే పోరాటం' అంటారు ప్రముఖ రచయిత మిలన్ కుందేరా. రచనల్లోనో, కవితల్లోనో ప్రశ్నిస్తామంటేనో, స్వేచ్ఛ అనుభవిస్తామంటేనో కుదిరే పరిస్థితులు ఇప్పుడు లేవు. ఒక తూటా ఒక్కరినే చంపుతుంది. కాని అది బలి తీసుకున్న నెత్తురు కోట్లాది గొంతుల్లో నిప్పుల జలపాతమై ఉరుకుతుంది. ప్రశ్నించే గొంతులన్నీ ఏకం కావాలి. భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం అడుగులొక్కటై కదలాలి. దభోల్కర్, పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేశ్ మాదిరిగా ఇంకోసారి మరో అభ్యుదయవాది చీకటి తూటాలకు బలి కాకూడదు. ప్రశ్నించే గొంతులు, స్వేచ్ఛా హృదయాలు... భయంతో ముడుచుకుపోయే మతోన్మాదాన్ని ఎదిరించాలి. 'నా దేశంలోనే నా గొంతు పరాయిదయిపోయింది. ఇక్కడ నేను అరచిన అరుపు ఆకాశంలోకి వెళ్లి, ఎక్కడో ఇరుక్కుపోతుంది. తిరిగి రానేరాదు' అంటాడు గుంటూరు శేషేంద్ర. ప్రశ్నించే గొంతులు లేకపోతే ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం అవుతుంది. భీమ్ ఆజాద్, తులసీ చందు, సబ్రినా వంటి ప్రశ్నించే గొంతులు ఒంటరిపాటు కాకూడదు. వారి గొంతులు పరాయివవకూడదు. అసహన దాడుల్ని, నిరంకుశ పాలకుల్ని నిరసిస్తూ దేశమంతా కదలాలి.

మహనీయుల మాట



కేవలం పుస్తకాలు చదివి వదిలేస్తే ప్రయోజనం ఏముంది? చెదపురుగులు కూడా పుస్తకాలు నమిలేస్తాయి. అంతమాత్రాన జ్ఞానం వచ్చేసినట్లా?

- బి.ఆర్. అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.

B.R. Ambedkar

విశ్వగురు విద్వేషం, వేధింపుల పరివారం

ప్రస్తుతం

ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన ఏదో అసాధారణ సందర్భమైనట్టు ప్రచారం జరిగింది. అమెరికా స్టేట్ విజిట్ (ప్రభుత్వ పర్యటన)కు ఆహ్వానించడం అరుదైన గౌరవంగానూ మీడియా హైప్ ఇచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం అది విశేషం కావచ్చు గాని అదేదో ప్రపంచానికే ప్రతిష్ట అన్నట్టు చెప్పడం కన్నా హాస్యాస్పదమైన విషయం మరోటి వుండదు. అధికార అనధికార పర్యటన, కార్యక్రమ పర్యటన, కార్యక్రమ సహిత అధికార పర్యటన ఇన్ని వుంటాయట. వాస్తవానికి మొదటి రెండింటిలో అన్నీ కలసి వున్నాయి. కాని ప్రపంచాధిపత్య రాజకీయాలలో అమెరికా అనేక వ్యవహారాలు జరపడానికి వీలుగా అధ్యక్షుడికి మట్టి అంటకుండా ఇన్ని రకాలు నిర్ణయించారు. అధ్యక్షుడు ఆహ్వానిస్తేనే అది రాజ్య పర్యటన. ఇంతవరకూ ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ లను మాత్రమే బైడెన్ ఆహ్వానించారట. అంటే మోడీకి ఎంత ప్రాధాన్యత అన్నది ఆనందం. అదెంత దూరం వెళ్లిందంటే మొదటిసారి శ్వేత సౌధం తలుపులు తనను పిలిచాయని ప్రధాని కూడా పరవశంగా ట్వీట్ చేసేంత! నిజానికి ఇండియా వంటి చరిత్ర, ప్రతిష్ట కలిగిన దేశాధినేత మరో దేశానికి వెళ్లి అంతగా ఆనందోత్సాహాలు వెలిబుచ్చడం దేనికి నిదర్శనమవుతుందో చెప్పనవసరం లేదు. మర్యాదలకింద వదిలేద్దాం. ఈ పర్యటన ఫలితాలేమిటి, భారత దేశం అమెరికా ధృతకాష్ట్ర కౌగిలిలో చిక్కుకోవడం ఎటు దారితీస్తుంది...ఇదివరకే ప్రజాశక్తి వ్యాసాలలో వివరంగా ప్రస్తావించబడింది. కాగా విశ్వగురుగా మనకు మనం చెప్పుకుంటున్న విశ్వవేదికపై మన ప్రజాస్వామ్యం పట్ల ఎలాంటి అభిప్రాయం ఏర్పడుతోంది అనేది మీడియాలో అంతగా చర్చకు నోచుకోని మరో కోణం.




తెలకపల్లి రవి

మస్క్ నోట కూడా...

ఏదో సామెత చెప్పినట్టు ఇండియా పట్ల ప్రపంచ దేశాల తాజా అంచనా ఎలా వుందో మోడీ వైట్‌హౌస్ చేరకముందే తెలిసిపోయింది. పారిశ్రామికవేత్తలు వరస కట్టి ఆయనను కలుసుకుంటున్నారని పెద్ద హంగామా చేశారు. వారిలో ఒకరైన విపరీత వాణిజ్యవేత్త ఎలన్ మస్క్ 'టెస్లా' కార్ల కంపెనీ ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నారన్న వార్త బాగా ప్రచారంలో పెట్టారు. మస్క్ మోడీని కలుసుకున్నాక మీడియాతో మాట్లాడుతూ ప్రశంసలతో ముంచెత్తారు. అయితే 'మీ యాజమాన్యం లోని ట్విటర్‌పై మోడీ ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుందట కదా...' అని విలేకరులు అడిగితే సమాధానం దాటేశారు రైతాంగ నిరసనలపై ట్విటర్ ఇవ్వడం పట్ల కేంద్రం అభ్యంతరాలు తెల్పిందనీ వాటిని తొలగించవలసి వచ్చిందని ట్విటర్ బాధ్యుడైన ఆయన అంతకు ముందు ప్రకటించి వున్నారు). మళ్లీ మళ్లీ అడిగినపుడు ఏ దేశంలోనైనా అక్కడి చట్టాల ప్రకారమే పని చేస్తుంటామని దాటవేత సమాధానమిచ్చారు.







ఇది ఎవరో విలేకరి విషయమే అనుకుంటే సాక్షాత్తూ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా విషయంలోనూ ఇదే అప్రజాస్వామిక పోకడలు ప్రదర్శించారు బిజెపి పరివార్ నేతలు. భారత దేశం మైనార్టీల హక్కుల రక్షణ గురించి జాగ్రత్త వహించాల్సి వుంటుందని ఒబామా అనడం బిజెపి భరించలేకపోయింది. నేనే బైడెన్ స్థానంలో వుంటే ఈ సమస్యను తప్పక ప్రస్తావించేవాడినని కూడా ఒబామా అన్నారు. వెంటనే పరివార్ రంగంలోకి దిగింది.

ఇక స్టేట్ విజిట్ లేదా రాజ్య పర్యటనలో అదనపు ఆకర్షణ లాంఛనాలే. వాటిలో స్వాగతాలు, విందులతో పాటు ఉమ్మడిగా మీడియా గోష్టి నిర్వహించడం ముఖ్యమైంది. అసలు అమెరికా తన వ్యూహాలకు లోబడి వుండే వారికే ఈ ఆహ్వానం అందిస్తుంది. మన దేశం కోణంలో చూస్తే ప్రధానిగా మోడీ మీడియాతో మాట్లాడటం, ప్రశ్నలకు స్పందించడం ఇంతవరకూ తెలియని విషయం. ఆయన ఇండియాలో వుండగా ఎందుకు మీడియాను పిలవకుండా తిరుగుతారో కూడా స్పష్టమైపోయింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా వుండగా టీవీ ఇంటర్వ్యూలను పూర్తిగా బహిష్కరించడం కూడా ఇందుకే. 'చరిత్ర అడక్కు. చెప్పింది విను' చందంగా తన మన్‌కీ బాత్ వినిపించడం తప్ప జన్ కీ బాత్ వినడం ఆయన నిఘంటువు లోనే వుండదు. కనక ఆయన అమెరికాలో ముఖాముఖి విలేకరులతో మాట్లాడటం పెద్ద వార్తయింది.

మైనార్టీల మాటేంటి మోడీజీ?

మళ్లీ వైట్‌హౌస్‌కు వస్తే మీడియా గోష్టిలో సబ్రీనా సిద్ధిఖి అనే మహిళా జర్నలిస్టు ప్రశ్న ఆయనకూ సంఘ పరివారానికి బొత్తిగా మింగుడు పడలేదు. నిజానికి మోడీ పర్యటనకు ముందే వైట్‌హౌస్ తాము అధికారికంగా మైనార్టీల పరిస్థితిపై మోడీతో మాట్లాడనున్నట్టు స్పష్టం చేశారు. మాట్లాడారు కూడా. 'వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు చెందిన సిద్ధిఖి ఇండియాలో మైనార్టీల పరిస్థితుల గురించి వారిపై వివక్ష గురించి మోడీని నేరుగా అడిగారు. భావ ప్రకటనా స్వేచ్ఛను ఎలా కాపాడతారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో అందరూ సమానమేననీ, భారత రాజ్యాంగం లౌకిక రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నందున మతపరమైన వివక్షకు అవకాశమే లేదని అందుకే బైడెన్ తనతో అదే అన్నారని మోడీ సమర్థనతో బయిటపడ్డారు, ప్రజాస్వామ్యం మా డిఎన్ఎలో వుందన్నారు. ఇవన్నీ సూక్తులే తప్ప ఆమె ప్రశ్నకు సమాధానాలు కాదు. ఇదంతా ఒక ఎత్తయితే తర్వాత జరిగిన ప్రహసనం మరో ఎత్తు. సిద్ధిఖి అలా ప్రశ్నించినందుకు ఆమెపై సంఘపరివారీయులు ట్రోలింగ్స్ మొదలెట్టారు. ఆమె ఉద్దేశపూర్వకంగానే ఈ అంశం లేవనెత్తారని దాడి చేశారు. బిజెపి ఐ.టి విభాగం బాధ్యుడైన అమిత్ మాలవీయ ట్వీట్ చేస్తూ మోడీ ఆమె దురుద్దేశాన్ని తుత్తునియలు చేశారని పొగడ్తలు గుప్పించారు. ఇవన్నీ భరించలేని సిద్ధిఖి 2011లో భారత క్రికెట్ టీమ్ విజయం సాధించినప్పుడు ఆ డ్రస్సు వేసుకుని తండ్రితో కలసి కేరింతలు కొడుతున్న తన చిన్నప్పటి ఫోటో ఒకటి ట్వీట్ చేశారు. కొన్నిసార్లు ఫోటోలే ఎక్కువ విషయాలు చెబుతాయని వ్యాఖ్య జోడించారు. మరోవంక వైట్‌హౌస్‌లో జరిగిన గోష్టిలో ప్రశ్న వేసిన వారినే ఇలా వెంటాడి వేధించడం అమెరికా లోనూ విమర్శలకు గురైంది. చివరకు అక్కడి ఉన్నతాధికారి జాన్ కిర్బీని మోడీ పర్యటన ముగిశాక జరిగిన గోష్టిలో ఆమెను అదే పత్రిక ప్రతినిధి ఈ విషయమై అడిగినపుడు మీడియా గోష్టిలో దీనిపై తమ అసమ్మతి ప్రకటించారు. ప్రశ్నించిన వారిని ఇలా వెంటాడటం సరైంది కాదని స్పష్టం చేశారు. ఆమెతో పాటు పత్రికా వ్యవహారాల కార్యదర్శి కెరెన్ జీన్ పిర్రే కూడా వేధింపులను ఖండించారు

ఒబామా అయితే మాకేంటి?

ఇది ఎవరో విలేకరి విషయమే అనుకుంటే సాక్షాత్తూ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా విషయంలోనూ ఇదే అప్రజాస్వామిక పోకడలు ప్రదర్శించారు బిజెపి పరివార్ నేతలు. డెమోక్రటిక్ పార్టీ నాయకుడూ తొలి నల్లజాతి అధ్యక్షుడు అయిన ఒబామా ఎప్పుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పరిపాటి. మోడీ ప్రధాని అయిన కొత్తలో వచ్చిన ఒబామా మత సామరస్యం గురించి, ఆర్భాటాలకు దూరంగా వుండాల్సిన అవసరం గురించి చెప్పడం గుర్తుండే వుంటుంది. మోడీని నరేంద్ర అనీ, బరాక్ అని పిలుచుకునేంత చనువు వారి మధ్య ఏర్పడిందని అప్పట్లో చెప్పేవారు. భారత దేశం మైనార్టీల హక్కుల రక్షణ గురించి జాగ్రత్త వహించాల్సి వుంటుందని ఒబామా అనడం బిజెపి భరించలేకపోయింది. నేనే బైడెన్ స్థానంలో వుంటే ఈ సమస్యను తప్పక ప్రస్తావించేవాడినని కూడా ఒబామా అన్నారు. వెంటనే పరివార్ రంగంలోకి దిగింది. ఒబామా ఆఫ్రికన్ ముస్లిం మూలాలు గలవాడు కావడం వారి కోపాన్ని రెట్టింపు చేసింది. ఇటీవలి కాలంలో చవకబారు వ్యాఖ్యలకు మారుపేరుగా మారిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ 'హుసేన్ గనక ఇలా చేయడంలో ఆశ్చర్యమేమీ లేద'ని ఆయనను మత కోణంలో అవహేళన చేస్తూ ట్వీట్ పెట్టారు. వాస్తవంలో ఒబామా క్రైస్తవుడే గాక వారి మతాచారాలు పాటిస్తారు! శర్మ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరింత తీవ్రంగా సుదీర్ఘంగా ఇదే విషయమై దాడి చేశారు. ఒబామా హయాంలో అమెరికా ఏ ముస్లిం దేశాలపై దాడి చేసిందీ ఏకరువు పెట్టారు. వాస్తవానికి ఆ సమయంలో భారతదేశం లేదా బిజెపి అందుకు అభ్యంతరం చెప్పిందేమీ లేకపోగా అమెరికా నాయకత్వంలో టెర్రరిజంపై పోరాటంలో పాల్గొనాలని వత్తాసు పలికింది. బిన్ లాడెన్ వంటి వారికి అమెరికానే అండగా నిల్చిన విషయం మర్చిపోయింది. డోనాల్డ్ ట్రంప్ హయాంలోనైతే మోడీ ఎంతగా చెట్టపట్టాలేసుకుందీ ఎవరూ మర్చిపోరు. ఆఖరుకు ఒకరికొకరు ఎన్నికల ప్రచారంలోనూ సహకరించుకున్నంత పనిచేశారు. ట్రంప్‌కు మద్దతు పలకడంలో మోడీ మామూలు దౌత్య మర్యాదలను కూడా దాటిపోవడం అమెరికాలోనూ విమర్శకు గురైంది. అలాంటి ప్రభుత్వంలో కీలక మంత్రిగా వున్న నిర్మలా సీతారామన్ ఇప్పుడు మాత్రం వాటన్నిటినీ గుర్తు చేస్తూ 'మా వ్యవహారాలలో మీ జోక్యం ఏమిట'ని రెచ్చిపోయారు. ఆరు ముస్లిం దేశాలపై దాడి చేసిన అమెరికా మాకు మైనార్టీల గురించి చెప్పడమేమిటని రెచ్చిపోయారు. అంతటితో ఆగక ప్రతిపక్షాలనూ జత చేశారు. తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టి కష్టపడుతుంటే ప్రతిపక్షాలు సరైన సమస్యలపై పోరాడలేక అమెరికా మాజీ అధ్యక్షుడితో కలసి ఈ అప్రధానమైన అంశం ఎత్తుకున్నారని వాపోయారు. దేశంలో ప్రభుత్వాన్ని మార్చడం కోసం పాకిస్తాన్‌తో చేతులు కలిపాయని, విదేశీ టూల్‌కిట్లు దిగుమతి చేసుకుంటున్నారనీ కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణ చేశారు. రాజ్‌నాథ్ సింగ్ వంటి సీనియర్ మంత్రి కూడా ఇదే పాట పాడటం గమనించదగింది.

ఒబామా అయినా సిద్ధిఖి అయినా ప్రైవేటు వ్యక్తులుగానే మాట్లాడారు తప్ప అమెరికా తరపున కాదు. తమకు ఇబ్బంది కలిగింది గనకనే కనీస దౌత్య మర్యాదలు కూడా పాటించక ఒబామాపై విరుచుకుపడటం బిజెపి ద్వంద్వనీతికి అద్దం పడుతుంది. కొంత కాలం కిందట బిబిసి ఆనాటి గుజరాత్ పరిస్థితిపై డాక్యుమెంటరీ ప్రసారం చేసినప్పుడు కూడా మోడీ సర్కార్ ఇలాగే దాడి చేసింది. దానిపై నిషేధం విధించి మనకు ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ పట్ల గౌరవం లేదని చాటుకుంది. ఎన్‌డి టి.వి, వైర్ వంటి వాటితో సహా మీడియా సంస్థలపై ఎలా ఒత్తిడి సాగిందీ అందరికీ తెలుసు. అది ముదిరి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరిందన్నమాట.

కళ్లు మూసుకున్న పిల్లి

ఒబామా అయినా సిద్ధిఖి అయినా ప్రైవేటు వ్యక్తులుగానే మాట్లాడారు తప్ప అమెరికా తరపున కాదు. తమకు ఇబ్బంది కలిగింది గనకనే కనీస దౌత్య మర్యాదలు కూడా పాటించక ఒబామాపై విరుచుకుపడటం బిజెపి ద్వంద్వనీతికి అద్దం పడుతుంది. కొంత కాలం కిందట బిబిసి ఆనాటి గుజరాత్ పరిస్థితిపై డాక్యుమెంటరీ ప్రసారం చేసినప్పుడు కూడా మోడీ సర్కార్ ఇలాగే దాడి చేసింది. దానిపై నిషేధం విధించి మనకు ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ పట్ల గౌరవం లేదని చాటుకుంది. ఎన్‌డి టి.వి, వైర్ వంటి వాటితో సహా మీడియా సంస్థలపై ఎలా ఒత్తిడి సాగిందీ అందరికీ తెలుసు. అది ముదిరి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరిందన్నమాట. రాహుల్ గాంధీ లేక గతంలో మన్మోహన్ సింగ్ వంటి వారు విదేశాల్లో ఏదో మాట్లాడితే దేశ ప్రతిష్ట దెబ్బ తిని పోయిందని గగ్గోలు పెట్టిన ఈ దేశభక్తులు విశ్వగురువులమంటూనే వికృత వివాదాలు ఎలా పెంచుతున్నదీ దేశంలో తమ నడవడి ద్వారా ప్రతిష్టను దెబ్బ తీస్తున్నదీ దాచిపెట్టాలని చూస్తున్నారు. కానీ వారెన్ని తంటాలు పడినా ప్రజాస్వామ్య ప్రమాణాలు ఘోరంగా దెబ్బ తింటున్నాయని ప్రపంచం గమనిస్తున్నదని ఈ సందర్భాలు స్పష్టం చేస్తున్నాయి. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్టు కపట నాటకమాడుతున్న మోడీ తదితరులు ఇప్పటికైనా ఈ అప్రజాస్వామిక పోకడలు విరమించితే దేశానికి శ్రేయస్కరం. నిర్మలా సీతారామన్ విమర్శ చేసేవరకూ ఒబామా వ్యవహారం పెద్దగా ప్రచారమివ్వమని మోడీ అనుకూల బడా మీడియాకు కూడా ఇది గుణపాఠమే. ★

ముంచుకొచ్చిన ప్లాస్టిక్ మహమ్మారి

ప్రమాదంలో పర్యావరణం, ప్రజారోగ్యం!!

సందర్భం

నిత్య జీవితంలో ప్లాస్టిక్ వినియోగం విడదీయలేని స్థాయికి చేరుకున్నది. ప్రతి నిత్యం మనకు నిత్యావసరాలైన కూరగాయలకు, కిరాణా సామాన్లకు, ఫ్యాన్సీ వస్తువులకూ మందులకు, ఎలక్ట్రానిక్స్ వస్తువులకు కూడా ప్లాస్టిక్ బ్యాగుల వాడడం మనకు అలవాటైపోయింది. తెలీకుండానే మన పరిసరాలు, భూమి, పర్యావరణం, ఆరోగ్యాలను తీవ్రంగా నష్టపరచుకుంటున్నాం. ఈ నేపథ్యంలో ముందుగా పర్యావరణాన్నీ, ప్రజారోగ్యాన్నీ తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ప్లాస్టిక్ మహమ్మారి గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం.

1. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నిమిషానికి 20 లక్షల ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించబడుతున్నాయి. 2. మన దేశంలో ప్రతి పౌరుడు సగటున ఒక్క సంవత్సరకాలంలో 11 కేజీల ప్లాస్టిక్ (బ్యాగులు, బాటిల్స్, స్ట్రా వంటివి) వాడటం జరుగుతున్నది. 3. ప్లాస్టిక్ బాటిల్స్ భూమిలో కరిగిపోవడానికి 450 ఏళ్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులు కరిగిపోవడానికి వెయ్యి సంవత్సరాలు పడుతుంది. 4. మొత్తం ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్‌లో కేవలం 9 శాతం మాత్రమే రీసైకిల్ చేయబడుతున్నది. 5. దాదాపుగా 14 ప్లాస్టిక్ బ్యాగుల ఉత్పత్తికి అవసరమయ్యే పెట్రోలియం నుండి ఒక మైలు దూరం వాహనం నడపటానికి అవసరమయ్యే గ్యాసును ఉత్పత్తి చేయవచ్చు. 6. ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పక్షులు, చేపలు, జంతువులు ప్లాస్టిక్ వల్ల చనిపోతున్నాయి. అంతరించిపోతున్న ప్రాణుల్లో దాదాపు 700 జాతులు ప్లాస్టిక్ వల్ల ప్రభావితమైనట్లు గుర్తించారు. 7. మనం తినే జలచరాల్లో (చేపలు, రొయ్యలు వంటివి) మైక్రోప్లాస్టిక్ అవశేషాలు ఉంటున్నట్లు శాస్త్రజ్ఞుల పరిశోధనల్లో ఇప్పటికే వెల్లడైంది. 8. ప్లాస్టిక్ కాల్చినప్పుడు విడుదలయ్యే డయాక్సిన్స్, ఫ్యూరాన్స్, మెర్క్యూరి, పాలిక్లోరినేటెడ్ బైఫినైల్స్, పాలిసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్ వంటి హానికరమైన రసాయనాలు మానవ ఆరోగ్యాన్నీ, మనం నివసించే భూమినీ, తాగే నీటిని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. 9. బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పోసి కాల్చడం మూలంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 20 మిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉత్పత్తి అవుతోంది. దీని ఫలితంగా 60 లక్షల మంది మరణిస్తున్నారని తెలుస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో కాల్చడం వల్ల దగ్గు, ఆస్తమా వంటి శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి. మనం తినే ఆహారం, తాగే నీటిలో సూక్ష్మ స్థాయిలో ఉంటున్న ప్లాస్టిక్ పాలిమర్ అవశేషాల వలన క్యాన్సర్, చర్మవ్యాధులు, హార్మోన్లకు సంబంధించిన వ్యాధులు, సంతానలేమి, గుండెపోటు వంటి వ్యాధులు సోకుతున్నాయి. 10. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఉల్లాసంగా, ఆహ్లాదంగా గడపడానికి సందర్శించే సముద్ర తీరాలలో (బీచ్‌లలో) పడవేసే వ్యర్థ పదార్థాలలో 73 శాతం ప్లాస్టిక్ ఉంటున్నది. 11. ప్లాస్టిక్ బ్యాగులు, బాటిల్స్ వంటి ఉత్పత్తుల నుండి విడుదలయ్యే వ్యర్థాలతో కలుషితమైన సముద్ర జలాల వలన సముద్రంలో విస్తారంగా ఉండి, ప్రపంచంలో పదిశాతం ఆక్సిజన్‌ను కిరణజన్య సంయోగక క్రియ ద్వారా అందిస్తున్న ప్రోక్లోరోకోకస్ అనబడే బ్యాక్టీరియా తీవ్రంగా దెబ్బ తింటున్నట్లు శాస్త్రజ్ఞులు గుర్తించారు. 12. శాస్త్రజ్ఞుల అధ్యయనం ప్రకారం 2050 సంవత్సరం నాటికి సముద్రాలలో చేపల కంటే ప్లాస్టిక్ పరిమాణం ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతానికి నదుల్లోనూ, సముద్రాల్లోనూ మన ఆహారం నిమిత్తం సేకరించే చేపల్లో ప్రతి మూడు చేపలలో ఒక్క చేప ప్లాస్టిక్ అవశేషాలు కల్గిఉన్నట్లు తెలుస్తోంది. 13. నేడు ప్రపంచ వ్యాప్తంగా సగటు మనిషి తినే ఆహారంలో ఒక వారానికి 5 గ్రాముల మైక్రోప్లాస్టిక్స్ కణాలను తింటున్నట్లు శాస్త్రజ్ఞుల అంచనా. 14. ప్రపంచ వ్యాప్తంగా 1974 సంవత్సరం నాటికి ప్లాస్టిక్ తలసరి వినియోగం 2 కేజీలు ఉండగా 2021 నాటికి 43 కేజీలకు చేరుకున్నది. ఈ వినియోగం నానాటికీ ఆందోళనకరంగా పెరుగుతున్నది. 2060 నాటికి ప్లాస్టిక్ తలసరి వినియోగం 123 కేజీలకు చేరనున్నట్లు అంచనా.



డా॥ కె.శివబాబు



జులై 3 అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగు రహిత దినం సందర్భంగా... ప్లాస్టిక్ మహమ్మారిపై పోరును ఒక అత్యవసర ఉద్యమంగా చేపట్టాలి. పర్యావరణం, ప్రజారోగ్య పరిరక్షణ కోసం, భావితరాలకు సురక్షితమైన జీవితం కోసం...ప్లాస్టిక్ బ్యాగులు, బాటిల్స్ తదితర వస్తువులను బహిష్కరించాలి. క్లాత్ బ్యాగులను వాడకాన్ని ప్రారంభించాలి. ఇందుకు అన్ని వర్గాల ప్రజలూ స్వచ్ఛందంగా పూనుకుంటేనే సాధ్యం.

ఇంత ప్రమాదకరంగా పరిణమించి గాలి, నీరు, నేల, మానవ ఆరోగ్యాలను కబళిస్తున్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వాల స్థాయిలోనే కాకుండా ప్రజలందరూ వ్యక్తిగత స్థాయిలో దీని ప్రాధాన్యతను అర్థం చేసుకుని సరైన దృక్పథంతో స్పందించకపోతే రానున్న తరాలకు మనం మిగిల్చేది క్యాన్సర్లు, ఆస్తమా, గుండెపోటు వంటి అనారోగ్యమూ, కలుషితమైన నేల, నీరు, గాలి మాత్రమే. రామేశ్వరం పోయినా శనీశ్వరం వదలదన్న సామెతలాగా మన దృక్పథం మార్చుకోకపోతే భూమిని వదిలి చంద్ర మండలం పోయినా మనకు తిప్పలు తప్పవు.

వ్యక్తిగతంగా మనమేం చేయవచ్చు?

1. టీ, కాఫీ తాగడానికి ప్లాస్టిక్ కప్పులు కాకుండా మట్టి, సిరామిక్, స్టీల్ కప్పులు వాడాలి. 2. కూరగాయలు, పండ్లు, కిరాణా సరుకులు తెచ్చుకునే ప్రతిసారీ క్లాత్ బ్యాగును తీసుకు వెళ్లాలి. 3. చికన్, మటన్, పాలు వంటి పదార్థాలు కొనుక్కురావడానికి స్టీల్ క్యాన్, బాక్స్ వాడాలి. 4. బయటకు వెళ్లే ప్రతి సందర్భంలోనూ, ప్రయాణాలలోనూ మంచినీళ్ల కోసం స్టీల్ బాటిల్ తీసుకువెళ్లాలి. 5. బర్త్ డే లు, శారీ ఫంక్షన్లు, వివాహాలు, గృహప్రవేశాలు వంటి పలు సందర్భాలలో స్టీల్ గ్లాసులు మాత్రమే వాడాలి. 6. ఫంక్షన్లలో ఇచ్చే రిటన్ గిఫ్ట్‌లు ప్లాస్టిక్‌వి కాకుండా పర్యావరణానికి మేలు చేసే ...మొక్కలు, క్లాత్, జ్యూట్ బ్యాగులు వంటివి ఇవ్వాలి.

ఇప్పటికే అనేక దేశాలలో ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం జరిగింది. మన దేశంలో కొన్ని రాష్ట్రాలలో ప్లాస్టిక్ వినియోగంపై జరిమానాలు కూడా విధిస్తున్నారు. అధికారికంగా తెలుగు రాష్ట్రాలలో కూడా 120 మైక్రాన్ల సైజు కంటే తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించారు.

జులై 3 అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగు రహిత దినం సందర్భంగా...పర్యావరణ ప్రేమికులు, ప్రజారోగ్య ఉద్యమకారులు, అభ్యుదయవాదులు ప్లాస్టిక్ మహమ్మారిపై పోరును ఒక అత్యవసర ఉద్యమంగా చేపట్టాలి. పర్యావరణం, ప్రజారోగ్య పరిరక్షణ కోసం, భావితరాలకు సురక్షితమైన జీవితం కోసం...ప్లాస్టిక్ బ్యాగులు, బాటిల్స్ తదితర వస్తువులను బహిష్కరించాలి. క్లాత్ బ్యాగుల వాడకాన్ని ప్రారంభించాలి. ఇందుకు అన్ని వర్గాల ప్రజలూ స్వచ్ఛందంగా పూనుకుంటేనే సాధ్యం.

(వ్యాసకర్త జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు, సంగారెడ్డి జిల్లా)

జనవాక్యం

పన్నుల మోత

ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం వారు దాదాపు ప్రతి వస్తువు మీదా పన్నుల మోత మోగిస్తుండటంతో సామాన్య ప్రజలు బేజారెత్తి పోతున్నారు. ముఖ్యంగా ప్యాక్ చేయని వస్తువులను మినహాయిస్తే ప్యాకింగ్ అయిన ప్రతి వస్తువుపై కేంద్ర ప్రభుత్వం వారు ఎడా పేడా జీఎస్టీ విధిస్తూ సామాన్య ప్రజల అరకొర ఆదాయంపై చాలా తీవ్ర స్థాయిలో కొరడా ఝళిపిస్తుండటంతో వారు దిక్కుతోచని పరిస్థితులలోకి నెట్టివేయబడుతున్నారు. ఇక హాస్పిటల్‌లో రెంట్ రూముల మీద కూడా జీఎస్టీల దెబ్బ తప్పడం లేదు. ఇలా ఏ విధంగా చూసినా ఈ జీఎస్టీ పన్నులు సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మరో ఏడాదిలో ఎన్నికలు రాబోతున్నాయ్. కనుక...జాగో కామన్ మేన్.

- బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

కవిత్వం

నేటి మనిషి

నీవు అందరిలాగే పుట్టావు
కాని నీవు పెరిగిన పరిసరాలు
నీ బుద్ధిని కలుషితం చేశాయ్.
నీవు అందరిలా మంచోడివే
కాని 'నేనే' అనే అహంకారపు
పొరలు నీ కళ్ళను కమ్మేశాయ్.
నీవు మంచి స్వభావం కలవాడివే
కాని గురివింద గింజ స్వభావం
నీకు మధ్యలో అలవడింది.
నీ మనసు నిర్మలమయ్యిందే
కాని నేటి ప్రసార మాధ్యమాలు
నీ వ్యక్తిత్వాన్ని కల్మషం చేశాయ్.
గుప్పెడంత మనసు విప్పిచూడు
నీకన్నా గొప్పవాళ్ళు కనిపిస్తారు
బిగించిన పిడికిలి సడలించి చూడు
విశ్వమంతా ప్రేమ కనిపిస్తుంది.
స్వేదంతో లిఖిస్తున్న నా అక్షరాలు
ప్రేమతో పలకరించే నా పదాలు
వేదనతో నిర్మిస్తున్న నా వాక్యాలు
నీ అవివేకపు తెరలను తొలగిస్తాయిలే.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం,
సెల్: 7780277240

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో హెచ్‌డిఎఫ్‌సి విలీనం పూర్తి

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో హెచ్‌డిఎఫ్‌సి విలీనం విజయవంతంగా పూర్తి అయ్యిందని ఆసంస్థ తెలిపింది. అవసరమైన అందరు వాటాదారులు, నియంత్రణ సంస్థల అనుమతులు పొందిన తరువాత జులై 1వ తేది నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపింది. దీన్ని 2022 ఏప్రిల్ 4న ప్రకటించినప్పటికీ.. అన్ని ప్రక్రియలు నాటికి ముగిశాయి. రెండు కంపెనీల బోర్డులు శుక్రవారం నిర్వహించిన సమావేశాలలో విలీనం జూలై 1 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నాయి. దీంతో రూ.18 లక్షల కోట్ల ఆస్తులతో ఒక దిగ్గజ సంస్థ ఏర్పాటు అయ్యింది. విలీనం అనంతరం 12 కోట్ల కస్టమర్లు, 8,300 బ్యాంకు శాఖలు, 1.77 లక్షల మంది ఉద్యోగులతో కూడిన అతిపెద్ద బ్యాంకుగా ఆవిర్భవించింది. విలీన సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌గా కొనసాగనుంది.

సిబ్బంది నిర్లక్ష్యమే కారణం !

- బాలాసోర్ ప్రమాదంపై సిఆర్‌ఎస్ నివేదిక

న్యూఢిల్లీ : బాలాసోర్ దుర్ఘటనకు సిగ్నలింగ్, ఆపరేషన్స్ (ట్రాఫిక్) విభాగాలకు చెందిన సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని రైల్వే భద్రతా కమిషనర్ (సిఆర్‌ఎస్) పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన నివేదికను రైల్వే బోర్డుకు అందజేశారు. సీనియర్ అధికారిని ఉటంకిస్తూ హిందుస్థాన్ టైమ్స్ పత్రిక నివేదిక వివరాలు బయటపెట్టింది. కమిషనర్‌కు సమాంతరంగా సిబిఐ జరుపుతున్న విచారణలో ఎలాంటి జోక్యం చేసుకోవడం లేదని, ఆ సంస్థను ఎవరూ ప్రభావితం చేయడం లేదని ఆ అధికారి తెలిపారు. సిఆర్‌ఎస్ నివేదిక ప్రకారం... ఇంటర్ లాకింగ్ వ్యవస్థను మూసివేసి, పనిని ప్రారంభించాల్సిందిగా బహానగ బజార్ స్టేషన్‌లో సిగ్నలింగ్ పనులను పర్యవేక్షించే ఉద్యోగి స్టేషన్ మాస్టర్‌కు రిపోర్ట్ ఇచ్చారు. ఇది సాధారణంగా జరిగే పనే. పని పూర్తయిన తర్వాత ఆ సంకేతాన్ని మెమో రూపంలో అందిస్తారు. ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థ పని చేస్తోందని దీని అర్థం. అయితే రైలును ఆ మార్గంలో అనుమతించే ముందు సిగ్నలింగ్ వ్యవస్థను పరీక్షించేందుకు అనుసరించాల్సిన భద్రతాపరమైన ప్రొటోకాల్‌ను సిబ్బంది పాటించలేదు. దీనినిబట్టి చూస్తే ప్రమాదానికి సిగ్నలింగ్, ఆపరేషన్స్ సిబ్బందే కారణమని అర్థమవుతోంది. స్టేషన్ మాస్టర్ మెమోను అందుకున్నప్పటికీ పని పూర్తి కాలేదు. సిగ్నలింగ్ వ్యవస్థను పట్టించుకోకపోవడం టెక్నీషియన్ వైఫల్యమే అవుతుంది. రైల్వే ఆస్తులకు సంబంధించి ఏవైనా నిర్వహణ పనులు చేపట్టేటప్పుడు రైళ్ల భద్రత బాధ్యత ఆపరేషన్ సిబ్బంది పైన కూడా ఉంటుంది.

ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు భేష్..

- మూడు రెట్లు పెరిగిన లాభాలు : నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు మెరుగైన ప్రగతిని కనబర్చాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. స్థిరమైన రేటింగ్ ఔట్‌లుక్ ఉన్నప్పటికీ కొన్ని ప్రపంచ స్థాయి బ్యాంకులు కుప్పకూలాయన్నారు. శనివారం న్యూఢిల్లీలో పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ కొత్త కార్పొరేట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మేనేజ్‌మెంట్‌లో వృత్తి నైపుణ్యం కారణంగా భారతీయ బ్యాంకులు బాగా పని చేస్తున్నాయన్నారు. "2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం దాదాపు మూడు రెట్లు పెరిగి రూ.1.04 లక్షల కోట్లకు చేరుకుంది. ఆర్థిక సంవత్సరం 2023–24లో భారతీయ బ్యాంక్‌ల స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ)లు 3.8 శాతానికి తగ్గి.. దశాబ్ద కనిష్టానికి దిగిరావొచ్చని అంచనా." అని సీతారామన్ పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ బ్యాంక్ పతనం తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని, ఒత్తిడి పాయింట్లను గుర్తించాలని సూచించామని సీతారామన్ పేర్కొన్నారు. కొత్త వ్యూహాలను రూపొందించడానికి ఈ సంఘటనను ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలని బ్యాంక్‌లను కోరామన్నారు.

రూ.1.61 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వానికి పన్ను ఆదాయాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుత ఏడాది జూన్‌లో 12 శాతం వృద్ధితో రూ.1.61 లక్షల కోట్ల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లయ్యింది. గతేడాది జూన్‌లో రూ.1.44 లక్షల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. 2017 జులైలో ఈ పన్ను విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత నాలుగో సారి రూ.1.60 లక్షల కోట్ల మార్క్‌ను నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం (2021–22) ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసిక కాలంలో సగటున నెలకు రూ.1.10 లక్షల కోట్లు, 2022–23లో అదే సమయంలో రూ.1.51 లక్షల కోట్లు, 2023–24లో మొదటి త్రైమాసికంలో రూ.1.69 లక్షల కోట్లకు జిఎస్‌టి వసూళ్లు పెరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గడిచిన జూన్‌లో రూ.1,61,497 కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. ఇందులో సిజిఎస్‌టి కింద రూ.31,013 కోట్లు, ఎస్‌జిఎస్‌టి కింద రూ.38,292 కోట్లు, ఐజిఎస్‌టి కింద రూ.80,292 కోట్లు చొప్పున వసూళ్లయ్యాయి. గడిచిన నెలలో తెలంగాణలో 20 శాతం వృద్ధితో రూ.4,681.39 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. గతేడాది ఇదే నెలలో రూ.3,901.45 కోట్ల జిఎస్‌టి వసూళయ్యింది. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,986.52 కోట్లు వసూళ్లు చోటు చేసుకోగా.. ఈ ఏడాది జూన్‌లో 16 శాతం పెరిగి రూ.3,477.42 కోట్లకు చేరాయి.

బ్రెజిల్ రాజకీయాల నుండి 8 ఏళ్ళ పాటు బొల్సనారో బహిష్కరణ



బ్రసీలియా : బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జేర్ బొల్సనారోను ఎనిమిదేళ్ళ పాటు దేశ రాజకీయాల నుండి బహిష్కరిస్తూ ఎన్నికల సంఘం ఓటు వేసింది. 2019–2023 మధ్య కాలంలో అధ్యక్షుడిగా వున్న సమయంలో బొల్సనారో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తేలడంతో ఎన్నికల సంఘం (టిఎస్‌ఇ) ఈ చర్య తీసుకుంది. 2022 అధ్యక్ష ఎన్నికల ప్రచారసమయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన బొల్సనారో దోషి అని ఇప్పటికే ముగ్గురు న్యాయమూర్తులు నిర్ధారించిన నేపథ్యంలో శుక్రవారం మరో న్యాయమూర్తి కార్మెన్ ఆంట్యూన్స్ కూడా వారికే మద్దతు తెలిపారు. దాంతో మొత్తం ఏడుగురు న్యాయమూర్తుల్లో నలుగురి మద్దతుతో మెజారిటీ తీర్పు వెలువడింది. తప్పుడు వార్తలు, బూటకపు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ద్వారా దేశంలో అభద్రతను రెచ్చగొట్టడానికి బొల్సనారో ప్రయత్నించారని అంతకుముందు ప్రధాన న్యాయమూర్తి గొంజాల్వెస్ పేర్కొన్నారు. కాగా, న్యాయమూర్తుల నిర్ణయం వెలువడిన వెంటనే ప్రజలు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. ఇదొక చారిత్రక దినమని లాండ్‌లెస్ వర్కర్స్ మూవ్‌మెంట్ ట్వీట్ చేసింది. బొల్సనారో చర్యలను టిఎస్‌ఇ మెజారిటీ ఖండించింది. ఎనిమిదేళ్ళ పాటు దేశ రాజకీయాల్లో పాల్గొనే హక్కు ఆయనకు లేదని స్పష్టం చేసింది. అనర్హుడైన మొదటి మాజీ అధ్యక్షుడు బొల్సనారోనే అని ఆ ట్వీట్ పేర్కొంది.

బతుకులు బుగ్గి

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఎలాంటి ఆధారాలు లేవని అంది. టైర్ పేలిపోతే రబ్బరు ముక్కలు కానీ, టైర్ ఈడ్చుకుపోయినట్టు ఎలాంటి ఆనవాలు కానీ లేవని పేర్కొంది. ఫ్రంట్ యాక్సిల్ అసెంబ్లీ విడిపోవడంతో బస్సు ముందు భాగం రోడ్డును బలంగా తాకిందని, ఆ రాపిడికి మంటలు చెలరేగి ఉండొచ్చని (అప్పటికే బస్సు నడుస్తున్నందున ఇంజను ఆయిల్ ఉష్ణోగ్రతలు కూడా అధికంగా వుంటాయి) నివేదిక తెలిపింది. బస్సు ఎడమవైపు బోల్తా పడి ఈడ్చుకుంటూ వెళ్ళిందని, దీనివల్ల మరింత వేడి పుట్టి వుండవచ్చని తెలిపింది. వేగమే ప్రమాదానికి కారణమని ఎక్కడా చెప్పలేదు. రెండు గంటలా 24నిముషాల్లో బస్సు 152కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. అంటే గంటకు 70కిలోమీటర్ల వేగంతో సాగిందని నివేదిక పేర్కొంది.

20 నుంచి వర్షాకాల పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

ద్రవ్యోల్బణం, ధరలు పెరుగుదల, నిరుద్యోగం, మణిపూర్‌లో పరిస్థితి వంటి అంశాల నుంచి ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. యుసిసి అమలు వల్ల గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్ వ్యాఖ్యానించారు. మత కోణంలో నుంచి సమాజాన్ని రెండుగా చీల్చేందుకు ఉద్దేశపూర్వకంగానే బిజెపి యుసిసి చర్చ లేవనెత్తిందని ఆయన విమర్శించారు. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న కీలకమైన అంశాలపై చర్చకు ప్రభుత్వం ఈ సారైనా అనుమతినిస్తుందని తాము ఆశిస్తున్నామని కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ అన్నారు. పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉన్న అన్ని రాజకీయ పార్టీలకు కొత్త భవనంలో కార్యాలయాలను కేటాయించారు . ముఖ్యమైన డిపార్ట్‌మెంట్ల కార్యాలయాలను కొత్త పార్లమెంటు భవనానికి తరలించే ప్రక్రియ మొదలైంది.

ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంక్షోభం

- పట్టించుకోని యోగి ప్రభుత్వం
- మందిర నిర్మాణం పైనే దృష్టి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. అయితే ప్రజా సమస్యల కంటే బీజేపీకి మత రాజకీయాలే ముఖ్యమవుతున్నాయి. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు, వడగాల్పులు, కరెంటు కోతలు అధికమవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. వచ్చే సంవత్సరం ప్రారంభంలో అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభించేందుకు సకల సన్నాహాలూ చేస్తోంది. ప్రజలకు విద్యుత్, తాగునీటి సరఫరా వంటి కనీస వసతుల కల్పనను విస్మరిస్తోంది. రాష్ట్రంలో వడగాల్పుల కారణంగా ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నా ఎవరికీ పట్టడం లేదు.

చిన్‌హాట్ పారిశ్రామిక ప్రాంతంలో రాత్రి 9.30 గంటల నుండి ఉదయం 4.30 గంటల వరకూ విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. రాత్రి సమయంలో కరెంటు కోత..



పగటి వేళ సూర్యుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాజధాని లక్నోలోనే కాదు... నోయిడా సహా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో విద్యుత్ కోతలతో రాత్రి సమయంలో గాడాంధకారం అలుముకుంటోంది. సుమారు 86శాతం కుటుంబాలలో దీపాలు వెలగడం లేదు. అయితే ఇదేమీ బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎలాగైనా రామ మందిరాన్ని సకాలంలో నిర్మించి రాబోయే లోక్‌సభ ఎన్నికలలో విజయకేతనం ఎగరేయాలని ఆ పార్టీ ఆశిస్తోంది.

గతనెల జూన్ 15, 16, 17 తేదీలలో వడగాల్పుల కారణంగా బల్లియాలో, యూపీ తూర్పు ప్రాంతాలలో కనీసం 54 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ఏకే శర్మ, యూపీ పవర్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం దేవరాజ్ మధ్య విభేదాల కారణంగా పరిస్థితి మరింత దుర్భరంగా తయారైంది. దేవరాజ్ ముఖ్యమంత్రికి సన్నిహితుడు కాగా శర్మను ప్రధాని మోడీ కేంద్రం నుండి పంపారు. శర్మను రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకోవడం యోగికి సుతరామూ ఇష్టం లేదు. పైగా ఆయన తనకు విశ్వాసపాత్రులైన అధికారులను విద్యుత్ శాఖలో నియమించుకున్నారు. ఇదిలావుంటే వేతనాల సమస్యపై రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు మార్చిలో 72 గంటల పాటు సమ్మె చేశారు. అలహాబాద్ హైకోర్ట్ ఆదేశాలతో వారు సమ్మెను విరమించారు. పది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రినే ఇప్పటికీ వాడుతుండడంతో అవి ప్రస్తుత డిమాండ్‌ను ఏమాత్రం తీర్చలేకపోతున్నాయి. అదీకాక వేలాది మంది అనుభవజ్ఞులైన ఇంజినీర్లను విధుల నుండి తొలగించారు.

తీస్తాకు తాత్కాలిక ఊరట

- లొంగిపోవాలన్న గుజరాత్ హైకోర్టు ఉత్తర్వులపై వారం రోజుల పాటు సుప్రీం స్టే



న్యూఢిల్లీ/అహ్మదాబాద్: ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాదకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. బెయిల్ కోసం ఆమె చేసుకున్న అప్పీలును గుజరాత్ హైకోర్టు తిరస్కరించి, తక్షణమే లొంగిపోవాలంటూ శనివారం ఉదయం ఉత్తర్వులు ఇవ్వగా.. ఆమె వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం చెరొక వైఖరి తీసుకున్నారు. దీనిని విస్తృత ధర్మాసనానికి నివేదించాలని ఇరువురు న్యాయమూర్తులు భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌ను కోరారు. అయితే తగిన ధర్మాసనానికి నివేదించడానికి సమయం పడుతుంది కనుక ఈ లోగా గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం వారం రోజుల పాటు స్టే విధించింది.

2002 గుజరాత్ మారణహోమానికి సంబంధించి నిరాధార ఆరోపణలు చేశారంటూ మోడీ ప్రభుత్వం ఆమెపై కేసు బనాయించింది. ఈ కేసులో ఆమెను గత ఏడాది జులైలో అరెస్టు చేశారు. సెప్టెంబరులో ఆమెకు సుప్రీం కోర్టు తాత్కాలిక బెయిలు ఇచ్చింది. సుప్రీం సూచన మేరకు రెగ్యులర్ బెయిల్ కోసం గుజరాత్ హైకోర్టులో గత ఏడాదే ఆమె పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను విచారించిన గుజరాత్ హైకోర్టు శనివారం బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఆమెకు బెయిలు ఇస్తే మత సామరస్యాన్ని సాధించేందుకు జరుగుతున్న యత్నాలకు విఘాతం కలుగుతుందని, మత విద్వేషాలు పెచ్చరిల్లే ప్రమాదముందని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి నీర్జార్ దేశాయ్ వ్యాఖ్యానించారు. ఆమెను వెంటనే లొంగిపోవాలని ఆమెను ఆదేశించారు. అప్పీలుకు వీలుగా హైకోర్టు ఉత్తర్వుల అమలును నెల రోజులపాటు నిలిపివేయాలని తీస్తా తరపు న్యాయవాది మిహిర్ ఠాకూర్ మిహిర్ ఠాకూర్ చేసిన అభ్యర్ధనను సైతం హైకోర్టు తిరస్కరించింది. గుజరాత్ హైకోర్టు ఉత్తర్వులకు సవాల్ చేయడంతో అక్కడ ఆమెకు తాత్కాలికంగా ఊరట లభించింది. గుజరాత్ అల్లర్ల ఘటనలకు సంబంధించి నరేంద్ర మోడీ, మరికొందరికి సిట్ క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ జకియా జఫ్రీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చిన మర్నాడే ఈ కేసులో సహ నిందితుడైన మాజీ ఐపిఎస్ అధికారి ఆర్‌బీ శ్రీకుమార్‌ను కూడా అరెస్ట్ చేశారు.

బ్రిజ్ భూషణ్ ఛార్జిషీటుపై 7న ఆదేశాలు

న్యూఢిల్లీ: మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటును అనుమతించే విషయంపై ఈ నెల 7వ తేదీన ఆదేశాలు జారీ చేస్తామని ఢిల్లీ కోర్టు తెలిపింది. ఛార్జిషీటుపై శనివారం నాడే అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హర్‌జీత్ సింగ్ జస్పాల్ ఆదేశాలు వెల్లడించాల్సి ఉన్నప్పటికీ విచారణ ఇంకా పురోగతిలో ఉన్నదని, అనుబంధ ఛార్జిషీటు దాఖలు చేస్తామని నగర పోలీసులు తెలియజేయడంతో కేసును వాయిదా వేశారు. నేరానికి దారితీసిన కారణాలకు సంబంధించిన నివేదిక, సీడీఆర్ (కాల్ డిటైల్ రికార్డ్) నివేదిక కోర్టుకు అందాల్సి ఉంది. దీనికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఛార్జిషీటును అనుమతించే విషయంపై నిర్ణయాన్ని న్యాయమూర్తి ఈ నెల 7వ తేదీకి వాయిదా వేశారు.

సౌత్ ఈస్టర్ రైల్వే జీఎం అర్చనా జోషిపై వేటు

ఢిల్లీ : భారతీయ రైల్వే చరిత్రలోఅత్యంత ఘోరప్రమాదాల్లో ఒడిశాలోని బహనాగ మూడు రైళ్ల ప్రమాదం ఒకటి. గత నెల 2న బహనాగ బజార్ రైల్వేస్టేషన్ సమీపంలో మూడు రైళ్లు ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో 291 మంది మరణించగా, 1,100 మందికిపైగా గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై కుట్ర కోణంలో సీబీఐ విచారణ నిర్వహిస్తున్న సంగతి విధితమే. కాగా, ప్రమాదం జరిగిన నెల రోజుల తర్వాత సౌత్ ఈస్టర్న్ రైల్వే జనరల్ మేనేజర్ అర్చనా జోషిపై ప్రభుత్వం వేటువేసింది. ఆమె స్థానంలో కొత్త జీఎంగా అనిల్ కుమార్ మిశ్రాను క్యాబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ నియమించింది. వారిలో ఖరగ్‌పూర్ డివిజనల్ రైల్వే మేనేజర్ శుజాత్ హష్మీ, ఎస్ఈఆర్ జోన్ ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్ పీఎం సిక్దర్, ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ చందన్ అధికారి, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ డీబీ కేసర్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఎండీ ఓవైసీబీపై వేటువేసిన విషయం తెలిసిందే.

మద్దతు నిరాకరణపై దేశవ్యాప్త ఉద్యమం

- 20న చెరకు రైతుల ఆందోళన
- ఎఐఎస్ఎఫ్ఎఫ్ పిలుపు



న్యూఢిల్లీ : చెరకుకు మద్దతుధర (ఎఫ్ఆర్‌పి)ను 2023–24 సంవత్సరానికి క్వింటాల్‌కు కేవలం రూ.10 (టన్నుకు రూ.100) చొప్పున పెంచుతూ మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యను అఖిల భారత కిసాన్ సభ అనుబంధ సంస్థ అయిన అఖిల భారత చెరకు రైతుల సమాఖ్య (ఎఐఎస్ఎఫ్ఎఫ్) తీవ్రంగా ఖండించింది. రైతన్నలకు ముష్టి వేసినట్లు రూ.10 పెంచడమేంటని ప్రశ్నించింది. రైతులను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ఎఫ్ పిలుపునిచ్చింది. జులై 20వ తేదీన దేశవ్యాప్త నిరసన దినంగా పాటిస్తూ, చెరకు మిల్లుల ముందు , కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా ఆందోళనలు చేపట్టాల్సిందిగా అన్ని రాష్ట్రాలకు పిలుపిచ్చింది. ప్రాథమికంగా 10.25 శాతం చక్కెర రికవరీ గల చెరకుకు గత ఐదేళ్లలో మద్దతు ధర క్వింటాల్‌కు కేవలం రూ.40 మాత్రమే పెరిగి రూ.275 నుండి రూ.315కి చేరుకుందని పేర్కొంది. స్వామినాథన్ ఫార్ములా సిటు ప్లస్ 50 శాతం ప్రాతిపదికగా 9.5 శాతం చక్కెర రికవరీ వద్ద క్వింటాల్‌కు కనీసం రూ.500 చొప్పున టన్నుకు రూ.5 వేలుగా, చెరకుకు ప్రోత్సాహక ధరను నిర్ణయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆకాశన్నంటేలా ఉపకరణాల ధరలు పెరిగిన కారణంగా ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతోందని, కానీ ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకోలేదని చెరకు రైతుల సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రవీంద్రన్, ఎన్.కె.శుక్లాలు ఒక ప్రకటనలో విమర్శించారు.

రాష్ట్రాల సిటు వ్యయ అంచనాల సగటు పరిగణనలోకి తీసుకుంటే దానికి 50శాతం కలిపితే క్వింటాల్‌కు రూ.438.75 అవుతోంది. కానీ ప్రభుత్వం ప్రకటించింది క్వింటాల్‌కు రూ.315 అంటే రైతు ఒక్కో క్వింటాల్‌కు రూ.123.5 మేర నష్టపోతున్నారని వారు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం క్వింటాల్‌కు సగటు ఎటు ప్లస్ ఎఫ్ఎల్ వ్యయాన్ని ఉత్పత్తి వ్యయంగా పరిగణించిందని అన్నారు. ఇటువంటి మోసపూరితమైన, దారుణమైన లెక్కలు వేసి చూపిస్తూ ఉత్పత్తి వ్యయం కన్నా 50శాతం ఎక్కువ ఇస్తున్నామని ప్రభుత్వం చెప్పడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. ప్రతి రాష్ట్రంలోనూ చెరకు రైతులు పెద్ద మొత్తంలో నష్టాల పాలవుతున్నారని ఆ ప్రకటనలో వారు పేర్కొన్నారు. చెరకునుండి చక్కెరను తయారుచేసే క్రమంలో వచ్చే ఉప ఉత్పత్తులపై వచ్చే లాభాల్లో కూడా తమకు వాటా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా వందలాది చెరకు మిల్లులు మూతపడ్డాయని, పైగా రైతులు చక్కెర మిల్లులకు సరఫరా చేసిన చెరకుకు రావాల్సిన బకాయిలు పెద్ద మొత్తంలో వున్నాయని వారు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో దేశంలో చెరకు రైతులు తీవ్ర దుస్థితులన ఎదుర్కొంటున్నారన్నారు.

ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, చెరకు మద్దతు ధరను సవరించి, క్వింటాల్‌కు రూ.500చొప్పున ఇవ్వాలని చెరకు రైతుల సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. ఉప ఉత్పత్తుల నుండి వచ్చే లాభాల్లో వాటా ఇవ్వాలని కోరింది. ఎరియర్లను వెంటన చెల్లించాలని, మూతపడిన మిల్లులను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, సహకార రంగాల్లోని చెరకు మిల్లులను ప్రైవేటీకరించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు.

ఎఫ్ఆర్‌పి క్వింటాలుకు రూ.315 వద్ద వివిధ రాష్ట్రాల్లో నష్టం

రాష్ట్రం	సి2	సి2 ప్లస్ 50%	నష్టం
ఆంధ్రప్రదేశ్	357	535.5	220.5
బీహార్	241	361.5	46.5
గుజరాత్	289	433.5	118.5
హర్యానా	327	490.5	175.5
కర్ణాటక	258	387	72
మహారాష్ట్ర	214	321	06
పంజాబ్	298	447	132
తమిళనాడు	299	448.5	133.5
తెలంగాణ	332	498	183
ఉత్తరప్రదేశ్	310	465	150
భారత్	292.5	438.75	123.

భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్‌పై కాల్పుల కేసులో నలుగురు అరెస్టు

లక్నో: ఉత్తరప్రదేశ్‌కు చెందిన భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ పై తుపాకీతో కాల్పులు జరిపిన కేసులో నలుగురు వ్యక్తులను హర్యానాలో అరెస్ట్ చేశారు. అంబాలాలోని షాజాద్‌పూర్ ప్రాంతంలో ఒక దాబా సమీపంలో ఉన్న ఆ నలుగురిని అంబాలా స్పెషల్ టాస్క్ పోలీసులు, ఉత్తరప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా శనివారం అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులు వికాస్, ప్రశాంత్, లోవిష్ ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌కు, నాలుగో నిందితుడు వికాస్ హర్యానాలోని కర్నాల్‌కు చెందినట్లు ఎస్టీఎఫ్ అంబాలా యూనిట్ డీఎస్పీ అమన్ కుమార్ తెలిపారు. వారి నుంచి ఎలాంటి ఆయుధాలు స్వాధీనం చేసుకోలేదని చెప్పారు. నలుగురు నిందితులు అంబాలాలో దాక్కున్నారా లేదా అన్నదానిపై స్పష్టత లేదని అమన్ కుమార్ తెలిపారు. విచారణ కోసం వారిని ఉత్తరప్రదేశ్ పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. అయితే ఆజాద్‌పై కాల్పులకు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్న యూపీ పోలీసులు ముగ్గురు అనుమానితులను అరెస్ట్ చేశారు. వారిని ప్రశ్నించిన తర్వాత హర్యానాలోని అంబాలాలో ఉన్న నలుగురు నిందితులు గురించి తెలిసింది. దీంతో హర్యానా పోలీసుల సహకారంతో వారిని అరెస్ట్ చేశారు. కాగా, బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో సహారన్‌పూర్ జిల్లాలో ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంగతి తెలిసిందే.

జ్యుడిషియల్ విచారణ చేపట్టాలి : అజాద్ డిమాండ్

అణగారిన ప్రజల పక్షాన పోరాడుతున్న తన గొంతు నులిమేందుకు పెత్తందారి కులాలకు చెందినవారు భారీ కుట్ర పన్నారని చంద్రశేఖర్ అజాద్ ఆందోళన వ్యక్తం చేశారు. కాల్పుల ఘటనపై జ్యుడిషియల్ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తాను ప్రాణాలతో పోరాడుతున్నప్పటికీ నేరస్తులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆజాద్ విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న తీవ్ర నిర్లక్ష్యమని ఆరోపించారు. తనపై కాల్పులు జరిగిన సంఘటనపై సీఎం యోగి ఆదిత్యనాథ్ ఒక్క మాట కూడా మాట్లాడలేదని అన్నారు. నేరస్తులను ఆయన రక్షిస్తున్నారని, దీనికి ఇదే నిదర్శనమన్నారు. తనపై దాడి జరుగడం యూపీ ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. దీనికి బాధ్యత వహించి సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆజాద్ డిమాండ్ చేశారు.

నడిరోడ్డుపై నెత్తుటి ధార

- కెన్యాలో బీతావహం సృష్టించిన ట్రక్కు
- వాహనాలు, పాదచారులపై దూసుకెళ్లి విధ్వంసం
- 51 మంది మృతి – 32 మందికి గాయాలు



నైరోబీ (కెన్యా) : కెన్యాలో నడిరోడ్డుపై నెత్తుటి ధార పారింది. రద్దీగా ఉండే ఒక జాతీయ రహదారిపై అదుపు తప్పిన ఒక ట్రక్కు బీతావహం సృష్టించింది. వాహనాలు పైన, పాదచారులపైన దూసుకెళ్లింది. ఈ ఘోర ప్రమాదంలో 51 మంది చనిపోయారు. మరో 32 మంది గాయపడ్డారు. ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న ట్రక్కు ఒక్కసారిగా అదుపు తప్పడంతో అనేక వాహనాలను వరుసగా ఢీ కొట్టుకుంటూ చివరగా పాదచారులపైకి దూసు కెళ్లడంతో బీభత్సమైన పరిస్థితులు నెలకొన్నాయి. మతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి టీవీల్లో ప్రసారమవుతున్న దశ్యాలు చూస్తుంటే అక్కడంతా పెను విధ్వంసం చోటు చేసుకున్నట్లు కనిపిస్తోంది. మినీబస్సుల శిధిలాలు, బోల్తా పడిన ట్రక్కు కింద పలువురు చిక్కుకుపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. కెరిచో, నకురు పట్టణాల మధ్య హైవేపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక పోలీసు కమాండర్ జియోఫ్రీ మాట్లాడుతూ, ఇప్పటి వరకు 51మంది మరణించినట్లు తేలిందని, అయితే ట్రక్కు కింద కొంతమంది చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నామని తెలిపారు. గాయపడ్డవారిని పలు ఆసుపత్రులకు తరలించామని చెప్పారు.

కెన్యా రెడ్‌క్రాస్ వెంటనే ఘటనా స్థలానికి అంబులెన్స్‌లు, సహాయక కార్యకర్తలను పంపింది. భారీగా పడుతున్న వర్షాలతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు చెప్పారు. "ట్రక్ అధిక వేగంతో వస్తోంది. నేరుగా మార్కెట్‌లోకి రాకముందే అనేక వాహనాలను తప్పించేందుకు ప్రయత్నించింది" అని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. కెన్యా అధ్యక్షుడు విలియం రూటోతో సహా పలువురు నేతలు ఈ ఘటన పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని రవాణా మంత్రి ముర్కోమెన్ ట్విట్టర్‌లో తెలిపారు.

ఈఎంఐ కట్టలేదని కస్టమర్ కూతురి కిడ్నాప్..

చెన్నై : ఈఎంఐ కట్టలేదని కస్టమర్ కూతుర్ని ఓ ఫైనాన్స్ సంస్థ ఉద్యోగి కిడ్నాప్ చేసిన ఘటన తమిళనాడులో కలకలం రేపుతోంది.. ఈ ఘటనపై వివరాల ప్రకారం.. తిరునెల్వెల్లి జిల్లా మారుత్తూరు గ్రామంలోని ఈ ఘటన జరిగింది. ఓ ఫైనాన్స్ కంపెనీలో మారుత్తూరు గ్రామానికి చెందిన రాజా అనే వ్యక్తి 50 వేల రూపాయలు లోన్‌గా తీసుకున్నాడు. ఉద్యోగం పోవడంతో ఈఎంఐ సరైన టైంకి చెల్లించలేకపోయాడు.. అయితే, ఈఎంఐ కోసం రాజా ఇంటికెళ్లిన ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగి విఘ్నేష్.. రాజా ఇంటిలో లేకపోవడంతో.. ఇంట్లో ఉన్న 11 ఏళ్ల రాజా కుమార్ని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు.. ఇక, ఈ ఘటనపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అవ్వ, అమ్మ.. అక్కా, చెల్లి.. పట్టుమని పన్నెండేళ్లు నిండని పసిపిల్లలు.. అంతేనా..? చెవులు వినపడని, మాటలు రాని విభిన్న ప్రతిభావంతులు ఎర్రజెండాల నీడలో కదిలివస్తున్నారు. ఒకటి కాదు, రెండు కాదు.. వందల కిలోమీటర్లు ఎర్రటి ఎండలో.. కాలినడకన ప్రయాణించి వస్తున్నారు. అలుపెరగని యాత్ర చేస్తున్న ఆ మహిళలు పోలవరం నిర్వాసితులు.. అడవిబిడ్డలు.. కాయకష్టం తెలిసినోళ్లు.. కష్టాన్నే నమ్ముకున్నోళ్లు.. కూలీనాలీ చేసేటోళ్లు.. వారంతా 13 రోజులుగా పోరుబాటన ముందుండి నడుస్తూ.. వడివడిగా అడుగులు వేస్తూ.. యాత్రలో అగ్రభాగంలో నిలిచి వస్తున్నారు.



పోరుబాటలో మహిళలు

నెలసరి స్రావంతో ఒళ్లు తూలిపోతున్నా.. జ్వరంతో కాళ్లు కదలనీయకపోయినా.. బొబ్బలెక్కిన కాళ్లు.. ఒక్క అడుగు ముందుకు వేయబోమన్నా.. వెనుదిరిగేది లేదని.. వెనుకంజ లేదని.. దృఢచిత్తంతో ముందుకు అడుగులేస్తున్నారు. మహిళలారా.. శ్రమైక శక్తులారా.. కదిలిరండి పోరుబాటకు.. కలిసిరండి ప్రతిన బూని.. అన్న పిలుపును స్వాగతించి, ఎర్రజెండాల రెపరెపల మధ్య వందలాదిగా నడిచివస్తున్న వారిలో ఒక్కొక్కరిది ఒక్కో గాథ. మనసును ద్రవింపజేసే నిర్వాసిత గాథ ...

న్యాయం దక్కేవరకూ ...



'కళ్ల ముందే గూడు చెదిరిపోయింది.. చేతికొచ్చిన పంట నీట మునిగిపోయింది. వండుకున్న కూడు బిడ్డలకు కడుపునిండా పెట్టనైనా లేదు. ఈ లోపే వరద ముంచెత్తింది. ఉన్నఫలాన చేతికందిన సామాను పట్టుకుని అడవిలోకి పరుగులు పెట్టాం.. జోరువానలో ఒకటి, రెండు కాదు.. నెలల తరబడి అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మూడు నెలలు పొలాలు నీటిలోనే మునిగిపోయాయి. ప్రభుత్వం పరిహారం అరకొరే. తాటిచెట్టు ఎత్తు నీరు పారిన మా గ్రామం లాంటివి ఏటపాక మండలంలో ఇంకా ఉన్నాయి. అయినా మాకు ఇంత వరకు సర్వే చేయలేదు. మా గోడు పట్టించుకుంటారనే ఈ యాత్ర చేస్తున్నాం. మా బాధలు, కష్టాలు ప్రభుత్వానికి చేరేవరకు మా పోరాటం ఆగదు' అంటూ గతేడాది ముంపు అనుభవాన్ని చెబుతున్న వీరమ్మ ఎటపాక మండలానికి చెందిన మహిళ. ఆ మండలం నుండి యాత్రలో 40 మంది వరకు పాల్గొంటున్నట్లు ఆమె చెప్పింది. రెండు వారాలకు పైబడి నడుస్తున్న ఆమె ఇంకా ఇలా చెబుతోంది.. 'కాళ్లు నొప్పులు పెడుతున్నాయి.. చిన్నపిల్లల కాళ్లు బొబ్బలెక్కాయి. అయినా మేం నడక ఆపలేదు. నాయకులు విశ్రాంతి తీసుకోమని ఎన్నోసార్లు చెప్పారు. అయినా న్యాయం దక్కేవరకు విశ్రమించేది లేదని వారితోనే నడుస్తున్నాం' అంటున్నప్పుడు ఆమె మాటల్లో భవిష్యత్తు గురించి బెంగ, సాధించాలన్న పట్టుదలా స్పష్టంగా కనిపించాయి.

కాళ్లు బొబ్బలెక్కినా ...



ఈ యాత్రలో 11 ఏళ్ల బాలిక రజినీ కూడా భాగమైంది. విఆర్ పురం మండలానికి చెందిన ఈ పాప మొదటిరోజు నుండి యాత్రలో పాల్గొంటోంది. అమ్మానాన్న కూలీ పనులకెళితే.. ఆ ఇంటి నుంచి పోరుబాటకు వచ్చింది. పెద్దవాళ్లతో పాటు తను కూడా ఉదయం నుంచి రాత్రి వరకు అలాగే నడుస్తోంది. 'కాళ్లు బొబ్బలెక్కి, వాసిపోయి, నిద్ర పట్టక రాత్రుళ్లు లేచి కూర్చొంటోందని.. నడవలేవులే ఇంటికెళ్లిపోమ్మని ఎన్నిసార్లు చెప్పినా ... 'మా ఇంటి నుండి నేనొక్కదాన్నే వచ్చాను.. ఇప్పుడు నేను వెళ్లిపోతే ఎలా.. వరదల్లో మా ఇల్లు కొట్టుకుపోయినప్పుడు నాకు చాలా భయమేసింది. అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా ఉండేందుకు నాయకులు ఈ యాత్ర చేస్తున్నారు. అందుకే అమ్మ చెప్పగానే నేను యాత్రలో నడిచేందుకు సిద్ధమయ్యాను. నొప్పులొచ్చినా వెనక్కి వెళ్లనని చెప్పినట్లు' తెలుగు మాట్లాడడం సరిగ్గా రాని ఆ పాప అన్న మాటలను తనతో పాటు కలసి ప్రయాణం చేస్తున్నవారు వివరించారు.

గ్రామం మొత్తం మునిగిపోయింది ..



ఉపాధ్యాయ శిక్షణ పొంది, కూలీ పనులకెళుతున్న దారమ్మ విఆర్ పురం వెంకన్నగూడెం గ్రామానికి చెందింది. 'మా గ్రామంలో 250 ఇళ్లు ఉన్నాయి. గతేడాది వరదల్లో మా గ్రామం మొత్తం మునిగిపోయింది. తాటిచెట్లు కూడా కనబడలేదు. అయినా మా ఊరు ముంపు ప్రాంతంలో లేదని ప్రభుత్వం చెబుతోంది. ఆర్థికంగా చాలా నష్టపోయాం. ఏ సాయం అందలేదు. అందుకే యాత్ర చేస్తున్నాం. నాయకుల పిలుపు రాగానే మా గ్రామం నుంచి 20 మందిమి యాత్రలో భాగమయ్యాం' అంటున్నప్పుడు ఆమె మాటల్లో భవిష్యత్తుపై దిగులు కనిపిస్తోంది.

బిడ్డను అమ్మకు అప్పగించి ...



కూనవరానికి చెందిన జ్యోతి తన ఆరేళ్ల పిల్లవాడిని వృద్ధురాలైన తల్లి దగ్గర ఉంచి, యాత్రలో పాల్గొంటోంది. 'గతేడాది వరదల్లో పండిన పంట, ఇళ్లు కొట్టుకుపోయి గింజలు ఏమీ మిగల్లేదు. కొనుక్కొని తిన్నాం. కరువు పనులకెళ్లిన అరకొర డబ్బులతోనే జీవనం సాగించాం. గోదారి, శబరి మధ్య డెల్టాలో మా ఊరు ఉండడం వల్ల పాడైన ఇళ్లు బాగుచేసుకోవడానికి రూ.60 వేలు, రూ.70 వేలు ఖర్చయితే రూ.10 వేలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం మా దగ్గరికి రాలేదు. ఏవో సాకులు చెప్పి ఆ సాయం కూడా అందకుండా చేశారు. మాకు వరదలు కొత్త కాదు.. అప్పట్లో రెండు, మూడు రోజుల్లోనే తేరుకునేవాళ్లం. కానీ ఇప్పుడలా లేదు. గతేడాది వచ్చిన వరదలకు మూడు వారాలు డేరాలు కట్టుకుని అడవిలో ఉన్నాం. జోరువానలో పిల్లజెల్లాతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం' అంటూ ఎంతో ఆవేదనగా చెబుతోన్న ఆమె పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన పునరావాసాల గురించి కూడా కలత చెందుతోంది. 'మా మండలంలో ఒక గ్రామానికి ప్యాకేజీ కింద పునరావాసం ఇచ్చారు. అక్కడ నీళ్లు లేవు. కరెంటు లేదు. రోడ్లు లేవు. మాది నాణ్యమైన భూమి.. కానీ, ఇక్కడ రాళ్ల గుట్టలు ఉన్న నేల ఇచ్చారు. అది చూసి ఆ ఊరోళ్లు గుండెలు బాదుకున్నారు. మా గోడు ఎవరు పట్టించుకుంటారు? యాత్రలో భాగంగా పునరావాస కాలనీలకు వెళుతున్నాం. అవి చూస్తున్నప్పుడు మాకు భయం వేస్తోంది. రేపు మా పరిస్థితి కూడా ఇదేనన్న బెంగ పట్టుకుంది. ఇన్ని బాధలు చూసిన, అనుభవించిన మేమంతా న్యాయం కోసం పోరుబాటలో భాగస్వామ్యమయ్యాం. ఆరోగ్యసమస్యలు వేధిస్తున్నా వెనక్కివెళ్లడం లేదు' అంటూ చెబుతోంది.



అనారోగ్యం ఉన్నా.. ముందడుగు



'వరదలొచ్చి ఇళ్లు, పొలాలు నీట మునిగి మూడు నెలలు అడవిలోనే ఉండిపోయాం. ఉత్త చేతులతో వెళ్లిపోయాం. వరదల వల్ల అంటురోగాలు ప్రబలాయి. వైద్యం అందలేదు. జ్వరాలతో ఇబ్బంది పడ్డాం. విష పురుగుల నుండి పిల్లలను రక్షించుకునేందుకు రాత్రుళ్లు నిద్ర కూడా పోయేవాళ్లం కాదు. ఈ యాత్ర ద్వారానైనా మా పరిస్థితిలో మార్పు వస్తుందన్న ఆశతో ఇన్ని వందల కిలోమీటర్లు నడుస్తున్నాం. నెలసరి సమస్యలతో మాలో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు వస్తున్నాయి. అయినా వెనకడుగు వేయకుండా నడుస్తున్నాం' అంటున్న లక్ష్మి, చిన్న పిల్లలను వృద్ధురాలైన అత్తగారికి అప్పచెప్పి భర్తతో కలిసి యాత్ర చేస్తోంది.



అమ్మానాన్న లేని దేవికి చెవులు వినపడవు. మాటలు రావు. బంధువుల ఇంట్లో తలదాచుకుంటోంది. డిగ్రీ చదివింది. కాళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నా వెనక్కి వెళ్లటానికి ఇష్టపడడం లేదు. పట్టుదలతో నడిచి, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని బలంగా కోరుకుంటోంది.

... ఇలా పోలవరం పోరుకేక నడక యాత్రలో పాల్గొంటున్న ప్రతి ఒక్క మహిళా ఎంతో పట్టుదలతో ముందుకు నడుస్తోంది. పన్నెండేళ్ల బాలికల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకూ వందలాది మంది మహిళలు, పురుషులు ఈ యాత్రలో మున్ముందుకు సాగుతున్నారు. యాత్ర పిలుపు అందుకోగానే పెట్టే, బేడా సర్దుకుని సిద్ధమయ్యారు.

అడుగడుగునా ఆదరణ

తమ యాత్రకు ప్రజల నుంచి, ప్రజా సంఘాల నుంచి గొప్ప సంఘీభావం లభిస్తుందని యాత్రలో పాల్గొంటున్న మహిళలు ముక్తకంఠంతో చెబుతున్నారు. నాయకులు తమ పట్ల ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని, ఎప్పటికప్పుడు తమ అవసరాలు కనిపెడుతూ.. చెప్పులు తెగిపోతే చెప్పులు ఇప్పించడం, గొడుగులు ఇవ్వడం, మంచినీటి సౌకర్యం, మజ్జిగ, ఆహారం, అవసరమైన మందులు సకాలంలో అందిస్తున్నారని తెలిపారు.

యాత్రలో పాల్గొంటున్న ఎర్రదండుకు అడుగడుగునా పుష్పగుచ్ఛాలు, పూలదండలతో ఆయా గ్రామాల్లో ఘన స్వాగతాలు పలుకుతున్నారు. వ్యక్తులుగా, సంఘాలుగా తరలివచ్చి యాత్రకు సంఘీభావంగా పూల రేకలతో పూలవాన కురిపిస్తున్నారు. ఎర్రని జెండాలు పట్టుకుని కదిలివస్తున్న ఎర్రదండు పాదయాత్రతో వీధులన్నీ అరుణమయం అవుతున్నాయి.

– జ్యోతిర్మయి

ఈ యాత్ర ఎందుకంటే ...


మైదాన ప్రాంతంలో ఎన్నో లక్షల ఎకరాలకు సంవృద్ధిగా నీరు అందించే, లక్షలాది ప్రజల భవితకు బంగారు బాట వేసే బహుళార్థసాధక ప్రాజెక్టు పోలవరం. అది వందలాది ఆదివాసీ గ్రామాలు, సాగుభూములూ నీట మునిగితే, నిర్వాసితం అయిపోతే, అందే ఫలం. మరి ఊళ్లను, భూములను, ఇళ్లను త్యాగం చేసిన ఆదివాసీల పట్ల ప్రభుత్వాలు ఎంత బాధ్యతతో ఉండాలి? ఎంత దన్నుగా నిలవాలి? ఎంత ధైర్యాన్నివాలి? కానీ, అలా చేయటం లేదు. పోలవరం ప్రాజెక్టు గిరిజన బిడ్డల జీవితాల్లో ఎంతో విషాదాన్ని తెస్తోంది. ఉన్న ఊరిని, కట్టుకున్న ఇంటిని, నమ్ముకున్న భూమిని ప్రాజెక్టుకు అప్పజెప్పిన ఆ అడవిబిడ్డలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందడం లేదు. ముంపు ప్రాంతాలను ఖాళీ చేయించి పునరావాసం కల్పిస్తామన్న మాటలు నీటిమూటలయ్యాయి. అరకొర పనులతో కల్పించిన వసతులు వారిని దుర్భర జీవితాల్లోకి నెట్టేస్తున్నాయి. తమ బతుకులు బాగుచేయండని, అన్యాయం చేయొద్దని ఏళ్ల తరబడి వేడుకుంటున్నా పాలకులు వారి గోడు వినిపించుకోవడం లేదు.. అందుకే ఎన్నాళ్లీ నిర్లక్ష్యం.. ఎంతకాలమీ అగచాట్లూ అంటూ పోరుబాట పట్టారు ఆ గిరిజనం.

సంక్రాంతి బరిలో హనుమాన్



ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తేజా సజ్జా హీరోగా వస్తున్న చిత్రం 'హనుమాన్'. సూపర్ హీరోస్ నేపథ్యంలో ఫాంటసీ సినిమాగా ఈసినిమా వస్తున్న సంగతి తెలిసిందే. ప్రశాంత్ వర్మ, తేజా సజ్జా కాంబినేషన్‌లో ఇప్పటికే జాంబిరెడ్డి సినిమా వచ్చి హిట్ అయ్యింది. ఈ నేపథ్యంలో హనుమాన్ చిత్రం విడుదల తేదిని ప్రకటించారు మేకర్స్. నిజానికి ఈసినిమా ఎప్పుడో విడుదల కావాల్సి ఉంది. అయితే బెస్ట్ అవుట్ పుట్ ఇవ్వాలన్న నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఆలస్యం అయ్యింది. తాజాగా సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో హీరో తేజ సజ్జా చేతిలో హనుమాన్ జెండాతో ఒక కొండపై నుండి మరొక కొండ మీదికి దూకడం కనిపిస్తుంది. కాగా అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. వరలక్ష్మీ శరత్ కుమార్ మరో కీలక పాత్రలో నటిస్తుంది. ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్‌కి ప్రాధాన్యం ఉంది.

అభిమానుల అత్యుత్సాహం




పాత సినిమాలకు హంగులు దిద్దుకొని కొత్త సినిమాల రేంజ్‌లో ఈ మధ్య పలు సినిమాలు రీ-రిలీజ్ అవుతున్నాయి. తాజాగా పాతిక వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తొలిప్రేమ సినిమా జూన్ 30న పెద్ద ఎత్తున రీ-రిలీజ్ చేశారు. కాగా విజయవాడలోని కపర్ది థియేటర్‌ల హాలులో తొలిప్రేమ సినిమా ప్రదర్శితం అవుతుండగా కొందరు అభిమానులు తెరను చింపేశారు. ప్రస్తుతం దానికి సంబంధించిన ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఆ తెర తాలుకూ ఖర్చు లక్షల్లో ఉంటుందని మేనేజ్‌మెంట్ సభ్యులు అంటున్నారు. ఇలా మితిమీరిన అల్లరితో పలువురు థియేటర్లలో అల్లరి చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నారు. గతంలోనూ బిల్లా, సింహాద్రి వంటి రీ-రిలీజ్‌ల్లో అభిమానులు అత్యుత్సాహనికి పోయి థియేటర్ యాజమాన్యానికి తీవ్ర నష్టాలను తెచ్చిపెట్టారు.

నటుడు హరికాంత్ మృతి



కీడా కోలా సినిమాలో కీలకపాత్ర పోషించిన హరికాంత్(33) మృతిచెందాడు. శనివారం ఉదయం గుండెపోటు రావడంతో హరికాంత్ హఠాన్మరణం చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అతని మరణ వార్త విన్న పలువురు టాలీవుడ్ నటీనటులు సంతాపం తెలియజేస్తున్నారు. థియేటర్ ఆర్టిస్టుగా కెరీర్ ప్రారంభించిన హరికాంత్ కొన్ని సినిమాల్లో సైడ్ యాక్టర్‌గా చేశాడు. తరుణ్ భాస్కర్ కీడా కోలా సినిమాలో ఓ పాత్ర కోసం హరికాంత్‌ను తీసుకున్నాడు. రెండో రోజుల క్రితమే ఈ టీజర్ రిలీజై మంచి స్పందన తెచ్చుకుంది. టీజర్‌లో హరికాంత్ గన్ పట్టుకుని షూట్ చేస్తున్నట్లు కనిపించాడు. ఇలా సినిమా రిలీజ్‌కు సిద్ధమవుతుండగానే హరికాంత్ మృతిచెందడం బాధాకరమని మేకర్స్ తెలిపారు.

మహేష్ వర్కౌట్స్...



సూపర్ స్టార్ మహేశ్ బాబు యాభై ఏళ్ళకి దగ్గరవుతున్నా యంగ్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఆ విషయాన్ని తన ఇన్స్టాలో వర్కౌట్స్ చేస్తున్న వీడియో, ఫొటోలను పోస్ట్ చేసాడు మహేష్ బాబు. మెరుపు వేగంతో పరిగెడుతున్నాడు, ఇంటెన్స్ వర్కౌట్స్ చేస్తున్నాడు, నిమిషం వ్యవధిలోనే వేగంగా చేస్తూ కనిపించాడు. హీరో అంత ఫిట్ అండ్ యంగ్‌గా కనిపించడం వెనుక ఇంత కష్టం ఉంటుందా అని తెలియజేస్తున్నాడు. ఈ వీడియోస్ చూసిన మహేష్ అభిమానులు ఈ వీడియోను ట్రెండ్ చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా బాడీ పెంచే పనిలో ఉన్న తాను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాడు. పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌గా సెట్స్ పైకి వెళ్లనున్న ఎస్ఎస్ఎంబి 29 సినిమా కోసం తాను ఇలా కష్టపడుతున్నారని కొందరు అంటున్నారు.

ఫైనల్లో ఛెత్రీ సేన..

సెమీస్‌లో లెబనాన్‌పై 4-2గోల్స్‌తో గెలుపు

శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్



బెంగళూరు: శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లోకి భారత్ దూసుకెళ్లింది. శ్రీ కంఠీరవ స్టేడియంలో శనివారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో భారత్ పెనాల్టీ షూటౌట్‌లో 4-2గోల్స్ తేడాతో విజయం సాధించింది. నిర్ణీత సమయంతోపాటు అదనపు సమయంలోనూ ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. ఫలితం కోసం పెనాల్టీ షూటౌట్‌లకు నిర్ణయించారు. తొలి ప్రయత్నంలో ఛెత్రీ గోల్ కొట్టగా.. లెబనాన్ తరపున కొట్టిన బాల్‌ను భారత గోల్ కీపర్ సమర్థవంతంగా నిలవరించాడు. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు సుమారు 20వేల మంది ప్రేక్షకులు హాజరుకావడం విశేషం. సెమీస్ తొలి అర్ధభాగంలో భారత్ పై చెయ్యి సాధించింది. రెండు, మూడుసార్లు గోల్ చేసే సువర్ణావకాశం లభించినా ప్రయోజనం లేకపోయింది. ఇక రెండో అర్ధభాగంలో అదనపు సమయంలో లెబనాన్ జట్టు పుంజుకుంది. కానీ భారత డిఫెండర్లు, గోల్ కీపర్ అద్భుతంగా నిలవరించి లెబనాన్ జట్టు గోల్ కొట్టకుండా నిలువరించారు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 100వ, లెబనాన్ 99వ స్థానంలో ఉన్నాయి. మంగళవారం జరిగే ఫైనల్లో భారత్-కువైట్ జట్లు టైటిల్‌కై తలపడనున్నాయి. కువైట్‌తో లీగ్ దశలో తలపడిన భారత్ 1-1తో మ్యాచ్‌ను డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే.

కువైట్ తొలిసారి..

శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లోకి కువైట్ జట్టు తొలిసారి దూసుకెళ్లింది. శనివారం జరిగిన తొలి సెమీస్‌లో కువైట్ జట్టు మ్యాచ్ ముగిసే చివరి నిమిషాల్లో ఒక గోల్ కొట్టి బంగ్లాదేశ్ జట్టును ఓడించింది. రెండు అర్ధభాగాల 90నిమిషాల సమయం ముగిసే సరికి ఇరుజట్లు ఒక్క గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో 30నిమిషాల అదనపు సమయాన్ని కేటాయించగా.. తొలి అర్ధభాగం ఇంజూరీ సమయం(105+2వ ని.)లో కువైట్ జట్టు ఒక గోల్ కొట్టింది. ఆ గోల్‌ను అబ్దుల్లా ఆల్బోషీ చేశాడు.

పెనాల్టీ షూటౌట్

భారత్		లెబనాన్
ఛెత్రీ (గోల్)	1-0	మాటౌక్(మిస్)
అన్వర్ అలీ(గోల్)	2-1	వాలిద్ షౌర్(గోల్)
మహేశ్(గోల్)	3-2	సాదెక్(గోల్)
ఉదంత(గోల్)	4-2	బందెర్(మిస్)

స్కాట్లాండ్ చేతిలో ఓటమితో

వన్డే ప్రపంచకప్ రేసునుంచి వెస్టిండీస్ ఔట్..

చరిత్రలో తొలిసారి మెగా టోర్నీకి అర్హత సాధించని మాజీ ఛాంపియన్



హరారే: ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో వెస్టిండీస్ జట్టు విఫలమైంది. అర్హత టోర్నీలో భాగంగా జింబాబ్వే, నెదర్లాండ్స్ చేతిలో ఓడిన విండీస్ జట్టు.. సూపర్-6లో పసికూన స్కాట్లాండ్ చేతిలోనూ చిత్తుగా ఓడింది. శనివారం స్కాట్లాండ్ చేతిలో వెస్టిండీస్ జట్టు 7వికెట్ల తేడాతో ఓటమిపాలై చరిత్రలో తొలిసారి మెగా టోర్నీకి అర్హత సాధించడంలో విఫలమైంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ వెస్టిండీస్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగి స్కాట్లాండ్ బౌలర్ల దెబ్బకు 43.2ఓవర్లలో 181పరుగులకే ఆలౌటైంది. హోల్డర్(45), షెఫర్డ్(36) టాప్‌స్కోరర్స్. ముల్లెన్‌కు మూడు, సోలే, వాట్, గ్రేవ్స్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో స్కాట్లాండ్ జట్టు ఓపెనర్ మెక్‌బ్రిడే(0) వికెట్‌ను త్వరగా కోల్పోయినా.. మెక్‌ముల్లెన్, క్రాస్ కలిసి 2వ వికెట్‌కు 125పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అర్ధసెంచరీ పూర్తయ్యాక ముల్లెన్(69) ఔటైనా.. క్రాస్(74నాటౌట్) అర్ధసెంచరీతో మెరిసాడు. హోల్డర్, షెఫర్డ్, హొసైన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో స్కాట్లాండ్ జట్టు 7వికెట్ల తేడాతో వెస్టిండీస్ జట్టును ఓడించి మెగా టోర్నీకి అర్హత సాధించే రేసులో నిలువగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ముల్లెన్‌కు లభించింది.

గెలుపు దిశగా ఆసీస్

ఇంగ్లండ్ లక్ష్యం 371పరుగులు.. ప్రస్తుతం 114/4

లండన్: యాషెస్ సిరీస్ రెండోటెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా జట్టు గెలుపు దిశగా పయనిస్తోంది. ఇంగ్లండ్ 371పరుగుల లక్ష్యాన్ని ఉంచిన ఆసీస్ జట్టు.. నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి 114పరుగులకే నాలుగు వికెట్లు పడగొట్టి పట్టు బిగించింది. ఓవర్ నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 130పరుగులతో శనివారం నాల్గోరోజు ఆటను కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టు 101.5ఓవర్లలో 279పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 91పరుగుల ఆధిక్యతతో కలిసి ఆసీస్ జట్టు ఇంగ్లండ్ ముందు 371పరుగుల లక్ష్యాన్ని ఉంచగల్గింది. నాల్గోరోజు ఆటలో భాగంగా ఓపెనర్ ఖవాజా(77)కి తోడు స్మిత్(34), క్యారీ(21) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు.

నీరజ్‌కు స్వర్ణం

డైమండ్ లీగ్



లాసన్నె: డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ పోటీల్లో భారత స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా మరోసారి మెరిసాడు. శుక్రవారం రాత్రి జరిగిన జావెలిన్ త్రో విభాగంలో నీరజ్ ఐదో ప్రయత్నంలో 87.66మీటర్లు విసిరి ప్రథమస్థానంలో నిలిచాడు. 25ఏళ్ల నీరజ్.. గాయం కారణంగా ఒక నెల విరామం తర్వాత మళ్లీ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నాడు. తొలి ప్రయత్నంలో ఫౌల్ అయిన నీరజ్.. రెండో ప్రయత్నంలో 83.52మీ. ఆ తర్వాత 85.04మీ. త్రో చేశాడు. నాల్గో ప్రయత్నంలో మళ్లీ ఫౌల్ అయిన నీరజ్.. ఐదో ప్రయత్నంలో ఏకంగా 87.66మీ. విసిరాడు. ఆరో, చివరి ప్రయత్నంలో 84.15మీ. మాత్రమే విసిరాడు. దీంతో అత్యుత్తమ త్రో అయిన 87.66మీ. అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక జర్మనీకి చెందిన జూలియన్ వెబెర్(87.03మీ.), చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాకోబ్ వెడ్లెజ్(86.13మీ.) రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజిత, కాంస్య పతకాలను గెలిచాడు. దోహా వేదికగా జరిగిన డైమండ్ లీగ్‌లో నీరజ్ 88.67మీ. విసిరి తొలిసారి ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68